بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadr.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 10
సంచిక : 47
వార్షిక చందా 600/-రూ॥

**20 నవంబర్ 2025 క్రీ, శ.   20 నబువ్వత్ ఇఖా 1404 హి, శ.**
**28 జమాదిఉల్ అవ్వల్ 1447 హి,ఖ.**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయం సాధనాలను నమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ۔

## ఖుర్ఆన్ బోధనలు

وَقَضٰی رَبُّکَ اَلَّا تَعۡبُدُوۡۤا اِلَّاۤ اِیَّاہُ
وَبِالۡوَالِدَیۡنِ اِحۡسَانًا ؕ اِمَّا یَبۡلُغَنَّ عِنۡدَکَ
الۡکِبَرَ اَحَدُھُمَاۤ اَوۡ کِلٰھُمَا فَلَا تَقُلۡ لَّھُمَاۤ
اُفٍّ وَّلَا تَنۡھَرۡھُمَا وَقُلۡ لَّھُمَا قَوۡلًا کَرِیۡمًا ○

﴿سُوۡرَۃُ بَنِیۡۤ اِسۡرَآءِیۡلَ:24﴾

**అనువాదం:** మీరు అతనిని తప్ప మరొకరిని ఆరాధించరాదని, తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించుడని, వీరిరువురిలో ఏ ఒక్కరు లేదా ఇద్దరు వృద్ధాప్యంలో నీ ధరి చేరినచో వారిని ఏమియు అనకుమని, వారిని చీదరించక, వారిని సగౌరవముగా, నమ్రతతో పలకరించుమని నీ ప్రభువు తీర్మానించి యున్నాడు.

**(బఖరహ్:196)**

## అన్యులకు భక్తుడిగా మారకూడదని మరియు మీరు మీ తల్లి దండ్రుల పట్ల ఉపకార దృక్పథంతో వ్యవహరించాలని అల్లాహ్ కోరుకుంటున్నాడు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:

అన్యులకు భక్తుడిగా మారకూడదని మరియు మీరు మీ తల్లి దండ్రుల పట్ల ఉపకార దృక్పథంతో వ్యవహరించాలని అల్లాహ్ కోరుకుంటున్నాడు. వాస్తవానికి ఇది ఎంతటి సంరక్షణయో చూడండి!. మానవుడు పసివానిగా ఉన్నప్పుడు ఎలాంటి శక్తి సామర్థ్యములు ఉండవు. ఆ సమయంలో తల్లి ఎన్నో రకాలుగా సేవలు చేస్తుంది. అట్టి పరిస్థితులలో తల్లి ప్రయత్నాలకు తండ్రి కూడ అన్ని విధముగా తోడుంటాడు. అల్లాహ్ తాలా కేవలం తన అనుగ్రహాన్ని నిస్సహాయ ప్రాణుల సంరక్షణ కోసం రెండు రూపాలలో సృష్టించాడు. మరియు తన తేజస్సుతో కూడిన ప్రేమ నుండి ఒక తేజస్సు గల ప్రతిమను ఆ రూపాలలో సమకూర్చాడు. కాని ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమే మనగా తల్లిదండ్రుల ప్రేమ తాత్కాలికమైనది, అల్లాహ్ ప్రేమ శాశ్వతమైనది. అల్లాహ్ తాలా మానవుని హృదయంలో ఆకంక్షను కల్పించనంత వరకు మానవుడు మిత్రులను గాని, తోటి వారిని గాని, పాలకులను గాని అభిమానించలేడు. కాని అల్లాహ్ యొక్క సంపూర్ణ సంరక్షణ చర్య మహత్యపు ఆంతర్యమును చూసినచో ,తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతగా ప్రేమిస్తారనగా, వారిని పోషించడం కోసం అన్ని రకాల దు:ఖాలను నిండు మనస్సుతో భరిస్తుంటారు. చివరికి వారి ఉజ్వల భవిష్యత్తు కొరకు చనిపోవడానికి కూడ వెనుకాడరు.

**(జల్సా దుఆ యొక్క నివేదిక, పేజి 11)**

**ఫలా తఖుల్లహుమా ఉఫ్ఫిన్ వ్వలా తన్‌హర్ హుమా వ ఖుల్లహుమా ఖౌలన్ కరీమా.** అనగా మీ తల్లిదండ్రులను నిరుత్సహాపర్చునట్టి మాటలతో బాధించకూడదు. వారి గౌరవ మర్యాదలకు భంగం కల్గేలా మాట్లాడకూడదు. ఈ సూక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశించి అవతరించినది. కాని ఇందులోని అంతర్యమును చూసినచో ఇది ప్రవక్త (స) సమాజంను ఉద్దేశించి అవతరించ బడిందని అర్థమవుతుంది. ఎందుకనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తల్లి దండ్రులు ప్రవక్త (స) పసితనంలోనే మృతి చెందారు. ఈ ఆదేశంలో ఒక ఆంతర్యం కూడ ఉన్నది. అదేమనగా, ఈ సూక్తి ద్వారా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశిస్తూ, నీవు నీ తల్లిదండ్రులను గౌరవించుము. అన్నివేళల సంభాషించునప్పుడు వారి గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా మాట్లాడుము అని ఆదేశించినప్పుడు, ఇతరులు తమ తల్లిదండ్రులను ఎంతగా గౌరవించాలి అనే విషయాన్ని ప్రతి ఒక్క వివేక వంతుడు అర్థం చేసుకోవాలి. ఈ విషయాన్ని గూర్చియే మరొక సూక్తి ఇలా సూచిస్తుంది. **వఖజా రబ్బుక అల్లా తఅబుదూ ఇల్లా ఇయ్యాహు వబిల్ వాలిదైని ఇహ్‌సాన** అనగా నీవు కేవలం అతడినే ఆరాధించమని మరియు నీ తల్లిదండ్రులతో ఉత్తమముగా వ్యవహరించమని నీ సృష్టి కర్త నిన్ను కోరుతున్నాడు. ఈ సూక్తిలో విగ్రహాలను పూజించే విగ్రహారాదులకు విగ్రహాలకు ఎలాంటి శక్తి లేదని, అవి మీపై ఎలాంటి ఉపకారంను చూపలేవని, అవి మిమ్ములను సృష్టించ లేదని, మీరు బాల్యంలో ఉన్నప్పుడు అవి మిమ్ములను పోషించ లేదని నచ్చజెప్పడం జరిగింది. ఒకవేళ తనతో పాటు ఎవరినైన ఆరాధించుటకు అల్లాహ్ అనుమతించదలచినచో మీరు తల్లిదండ్రులను ఆరాధించండి అని ఆదేశించేవాడు. ఎందుకనగా వారు కూడ సంరక్షకుడికి ప్రతీకలే. సృష్టిలోని ప్రతీది దాని స్వభావికంతో, చివరికి పశుపక్షాదులు కూడ తమ పిల్లలను పసితనంలో కంటికి రెప్పలా కాపడుకోవడం జరుగుతుంది. కావున అల్లాహ్ సంరక్షణ తరువాత తల్లిదండ్రుల సంరక్షణయే ఉంటుంది. ఆ సంరక్షణ ఉత్సాహం కూడ అల్లాహ్ తాలా వైపు నుండే అనుగ్రహించబడుతుంది.

**(హఖీఖతుల్ వహి, పేజి 204-205)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

عَنۡ اَبِیۡ ھُرَیۡرَۃَ رَضِیَ اللّٰہُ عَنۡہُ قَالَ : جَآءَ رَجُلٌ اِلٰی رَسُوۡلِ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ فَقَالَ یَا رَسُوۡلَ اللّٰہِ ! مَنۡ اَحَقُّ النَّاسِ بِحُسۡنِ صَحَابَتِیۡ ؟ قَالَ : اُمُّکَ ۔ قَالَ ثُمَّ مَنۡ ؟ قَالَ : اُمُّکَ ۔ قَالَ ثُمَّ مَنۡ ؟ قَالَ: اُمُّکَ ۔ قَالَ ثُمَّ مَنۡ ؟ قَالَ : اَبُوۡکَ ۔ وَفِیۡ رِوَایَۃٍ ، یَا رَسُوۡلَ اللّٰہِ ! مَنۡ اَحَقُّ بِحُسۡنِ الصُّحۡبَۃِ؟ قَالَ اُمُّکَ ثُمَّ اُمُّکَ ثُمَّ اُمُّکَ ثُمَّ اَبُوۡکَ ثُمَّ اَدۡنَاکَ اَدۡنَاکَ ۔

■ హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హుమా ఇలా ఉల్లేఖించారు. ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకోని ప్రజలలో నా ఉత్తమ వ్యవహారమునకు ఎవరు ఎక్కువ అర్హులు? అని అడిగాడు. అందుకు ప్రవక్త (స) నీ తల్లి అని సమాధానం ఇచ్చారు. ఆ తరువాత ఎవరు? అని మరల అడిగాడు. అప్పుడు కూడ నీ తల్లి అని ప్రవక్త (స) సమాధానం ఇచ్చారు. ఆ తరువాత ఎవరు? అని మరల అడిగాడు. అప్పుడు కూడనీ తల్లి అని ప్రవక్త (స) సమాదానం ఇచ్చారు. ఆ తరువాత ఎవరు? అని నాలుగవ సారి అడిగాడు. అప్పుడు ప్రవక్త (స) నీ తల్లి తరువాత నీ తండ్రి నీ ఉత్తమ వ్యవహారానికి ఎక్కువ అర్హులు ఆ తరువాత క్రమక్రమంగా నీ సమీప బంధువులు అని సమాధానం ఇచ్చారు.

**(బుఖారి, కితాబుల్ అదబ్, బాబ్ మన్‌అహఖ్ఖున్నాస్ బిహుస్ని స్సోహబ్బతి వ ముస్లిం)(సేకరణ: హదీ ఖతు స్వాలీహీన్, మలిక్ సైఫ్ఫుర్రహ్మాన్ సాహెబ్ హదీస్ 394)**

## 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 26,27,28 డిశంబర్ 2025 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! **(నాజిర్ ఇస్లాహి విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

గత ఉపన్యాసంలో, ఒక ముస్లిం, ఒక వ్యక్తిని చంపిన సంఘటన గురించి నేను ప్రస్తావించాను, ఆ వ్యక్తి సలాంలు తెలియజేస్తున్నప్పటికీ, ఆ వ్యక్తిని చంపాడు. ఆ కారణం ఇగా సూరహ్ నిసాలోని 95వ వచనాన్ని కూడా నేను చదివాను, దీనిలో "ఎవరైనా మీకు సలాంలు తెల్పినచో, అతను విశ్వాసి కాదు అని పలుకకూడదని " చెప్పబడింది.

---

నేను ఇప్పుడు హిజ్రి 8వ సం॥లో జరిగిన మక్కా విజయం గురించి ప్రస్తావించుతాను. ఈ దండయాత్రను 'ఘన విజయం' అని కూడా పిలుస్తారు. నేను చెప్పినట్లుగా, ఇది హిజ్రి 8 వ సం॥ రమజాన్ మాసంలో జరిగింది. ఇది నిజంగా అద్భుతమైన విజయం, ఘన విజయం, దీని గురించి అల్లాహ్ ముందే శుభవార్తను చెప్పాడు. ఈ విజయం ఫలితంగా, ప్రజలు పెద్ద సమూహాలుగా ఇస్లాంలోకి ప్రవేశించడం ప్రారంభించారు.

---

సూరా ఫతహ్‌లో, మక్కా విజయానికి సంబంధించిన శుభవార్త క్రింది విధంగా పేర్కొనబడింది: లఖద్ రజియల్లాహు అనిల్ ముమినీన ఇజ్ యూబాయిఊనక తహత షజరతి ఫఅలిమ మా ఫీ ఖులూబిహిం ఫఅన్‌జల స్సకీనత అలైహిం వ అసాబహుం ఫత్‌హన్ ఖరీబా

---

పవిత్ర ఖురాన్‌లో మరొక చోట, మక్కా విజయం గురించి భవిష్యవాణి చేయడం జరిగింది. దీనిలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు ముస్లింలందరికి కూడా గుర్తు చేయడం జరిగింది. ఆదేమనగా, చూడండి! మీరు ఎక్కడికి వెళ్ళినా, చివరికి మక్కా జయించబడుతుందనే విషయాన్ని మర్చిపోకూడదు. ఇందుకోసం మీరు కూడా కృషి చేయాలి, కష్టపడి పనిచేయాలి మరియు ప్రార్థించాలి.

---

"దేవుని వాగ్దానం అంటే: 'మీరు బలహీనులు – మీరు బలహీనులు కాకపోతే, మీరు మక్కాను ఎందుకు వదిలి వెళ్ళేవారు? మక్కాను విడిచిపెట్టడం మీ బలహీనతను సూచిస్తుంది మరియు మీ శత్రువు బలవంతుడు. కానీ దేవుడు మీకు బలాన్ని ఇస్తాడు మరియు మీరు మీ విరోధుల నుండి మక్కాను తిరిగి పొందుతారు.

---

"వుజుహున్ అంటే 'దిశలు' అని కూడా అర్థం. అందువల్ల, దీని అర్థం మీకు ఒకే ఉద్దేశ్యం ఉండాలి. పవిత్ర కాబాను జయించి దానిని ఇస్లాం కేంద్రంగా మార్చడం, ఎందుకంటే మక్కాలో ఇస్లాం వ్యాపించే వరకు, మక్కా ముస్లింల పాలనలోకి రానంత వరకు, మిగిలిన అరేబియా ప్రాంతీయులు ముస్లింలుగా మారరు.

---

నేను ఒక అమరవీరుడి గురించి కూడా ప్రస్తావిస్తాను మరియు జుమా నమాజ్ తర్వాత వారి జనాజ నమాజ్ ను చదివించుతాను. షేక్ ముబష్షిర్ అహ్మద్ సాహిబ్ దిల్లి గారి కుమారుడు సర్గోధాలో ఉంటున్న డాక్టర్ షేక్ ముహమ్మద్ మహమూద్ సాహిబ్ గారిది. అహ్మదీయత్ వ్యతిరేకులు మే 16న కాల్పులు జరిపి వారిని హతమార్చారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్.

---

మరొక జర్నలిస్ట్ ఇలా వ్యాఖ్యానించారు: "ఇది చాలా కాలంగా కొనసాగుతోంది. పాకిస్తాన్‌ను కాపాడటానికి, తీవ్రవాద గ్రూపులు మరియు సంస్థలను ఆపాలి. ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించే మరియు అహ్మదీలను లక్ష్యంగా చేసుకునే ఇటువంటి కార్యకలాపాలను మనం అంతం చేయాలంటే ఈ తీవ్రవాద సంస్థలను నిషేధించడం అత్యవసరం."

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 23 మే 2025, ( 23 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ـ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ـ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ـ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ـ
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ـ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ـ
صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ـ

గత ఉపన్యాసంలో, ఒక ముస్లిం, ఒక వ్యక్తిని చంపిన సంఘటన గురించి నేను ప్రస్తావించాను, ఆ వ్యక్తి సలాంలు తెలియజేస్తున్నప్పటికీ, ఆ వ్యక్తిని చంపాడు. ఆ కారణం ఇగా సూరహ్ నిసాలోని 95వ వచనాన్ని కూడా నేను చదివాను, దీనిలో "ఎవరైనా మీకు సలాంలు తెల్పినచో, అతను విశ్వాసి కాదు అని పలుకకూడదని " చెప్పబడింది. ఆ సంఘటన యొక్క పూర్తి వివరాలను గత ప్రసంగంలో ప్రస్తావించలేదు. మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి. నేను క్లుప్తంగా చెప్పినట్లుగా – దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ వ్యక్తిని ఇలా చేయకుండా ఆపారని. మరొక చోట దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తీవ్ర కోపాన్ని వ్యక్తం చేసి అతని నుండి దూరం వెళ్ళారని, వాస్తవానికి, మరికొన్ని కథనాలలో ప్రవక్త (స) అతనికి వ్యతిరేకంగా ప్రార్థించారని కూడా పొందుపర్చడం జరిగింది. ఏదేమైనా, ఈ చర్య ద్వారా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తీవ్ర మనస్తాపానికి గురయ్యారు, ఎందుకంటే బాధితుడి కుటుంబం హత్యకు గురైన వ్యక్తికి ప్రతీకారం తీర్చుకునే అంశాన్ని హునైన్ యుద్ధం తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముందుంచింది. అందువల్ల, ఆ సంఘటన యొక్క వివరాలను ప్రస్తావించుతాను. ఇన్నా–అల్లాహ్. మొత్తానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం దీనిని దారుణమైన నేరంగా భావించారు.

పాకిస్తాన్‌లోని నేటి మతాధికారులు – విశ్వాస సంరక్షకులు అని పిలవబడే వారు దీనిని అర్థం చేసుకుని, అహ్మదీయులపై వారు చేస్తున్న అన్యాయాలను ఆపగలిగితే, బహుశా వారు అల్లాహ్ శిక్ష నుండి రక్షించబడవచ్చు.

ఏదేమైనా, వివిధ దండయాత్రల కథనాలను కొనసాగిస్తూ, నేను ఇప్పుడు హిజ్రి 8వ సం॥లో జరిగిన మక్కా విజయం గురించి ప్రస్తావించుతాను. ఈ దండయాత్రను 'ఘన విజయం' అని కూడా పిలుస్తారు. నేను చెప్పినట్లుగా, ఇది హిజ్రి 8 వ సం॥ రమజాన్ మాసంలో జరిగింది. ఇది నిజంగా అద్భుతమైన విజయం, ఘన విజయం, దీని గురించి అల్లాహ్ ముందే శుభవార్తను చెప్పాడు. ఈ విజయం ఫలితంగా, ప్రజలు పెద్ద సమూహాలుగా ఇస్లాంలోకి ప్రవేశించడం ప్రారంభించారు. **(షారఅ–జుర్కానీ, వాల్యూం. 3, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజి. 386)( సుబులుల్–హుదా వర్రిషాద్, వాల్యూం. 5, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజి. 200)**

హజ్రత్ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు పవిత్ర ఖురాన్‌లో ముందే చెప్పబడిన మక్కా విజయానికి సంబంధించిన శుభవార్తలను వివరిస్తూ, ఇలా పేర్కొన్నారు. **వ ఖుల్ రబ్బి అద్‌ఖిల్‌ని ముద్‌ఖల సిద్‌ఖిన్ వ్వ అఖ్‌రిజ్‌నీ ముఖ్‌రజ సిద్‌ఖిన్ వ్వజ్ అల్‌ల్లి మిన్‌ల్లదున్‌క సుల్తానన్ న్నసీర (బనీ ఇస్రాయిల్: 81)** అనగా "నీవు ఇలా చెప్పు, 'ఓ నా ప్రభూ, నాకు ఈ నగరంలోకి (అంటే, మక్కా) మంచిగా ప్రవేశం కల్పించు అనగా వలస తర్వాత విజయం మరియు ఆధిక్యతను ప్రసాదించుము. మరియు ఈ నగరం నుండి నన్ను క్షేమముగా, సురక్షితముగా బయటకు తీసుకవెళ్ళు. అనగా ప్రస్థానం తరువాత నీవే స్వయముగా నాకు నీ సన్నిధి నుండి ఆధిక్యతను, సహాయంను అందించుము. " "ఇది సూక్తులు వలసకు ముందు బనీ ఇస్రాయిల్ అధ్యాయణంలో అవతరించినవి. ఇందులో వలస మరియు

తదుపరి మక్కా విజయం గురించి ముందే చెప్పబడింది." **(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వర్-ఉల్-ఉలూమ్, వాల్యూం. 20, పేజ. 346)**

సూరా ఫతహ్‌లో, మక్కా విజయానికి సంబంధించిన శుభవార్త క్రింది విధంగా పేర్కొనబడింది: **లఖద్ రజియల్లాహు అనిల్ ముమినీన ఇజ్ యూబాయిఊనక తహత ష్షజరతి ఫఅలిమ మా ఫీ ఖులూబిహిం ఫఅన్‌జల స్సకీనత అలైహిం వ అసాబహుం ఫత్‌హన్ ఖరీబా (ఫతహ్ :19)**

అనగా "నిశ్చయంగా, విశ్వాసులు చెట్టు కింద నీ బైఅత్ చేసినప్పుడు అల్లాహ్ వారిని చూసి సంతోషించాడు మరియు వారి హృదయాలలో ఏముందో ఆయనకు తెలుసు, మరియు ఆయన వారిపై ప్రశాంతతను కురిపించాడు మరియు వారికి సమీప విజయాన్ని ప్రతిఫలంగా ఇచ్చాడు."

నిజం ఏమిటంటే, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా నుండి వలస వచ్చిన రోజే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రవక్త (స)కు "దుఃఖించకు, నేను నిన్ను ఈ ప్రదేశానికి తిరిగి తీసుక వచ్చే రోజు వస్తుంది" అనే శుభవార్తను ఇచ్చాడు.

వాస్తవానికి, వలస సమయంలో ఈ క్రింది సూక్తి వెల్లడి చేయబడిందని పేర్కొనబడింది: **ఇన్నల్లజీన ఫరజ అలైకల్ ఖుర్‌ఆన లరఅద్దుక ఇలా మఆది (ఖసస్:86)** "ఖుర్‌ఆన్ బోధనను మీపై విధిగావించేలా చేసిన అతడే మిమ్మల్ని తిరిగి ఈ ప్రదేశానికి తీసుకువస్తాడు." ఈ సూక్తిని విశ్లేషిస్తూ ఇమామ్ ఫక్రుద్దీన్ ఇలా పేర్కొన్నారు. ఈ సూక్తిలో మఆద్ అనగా "తిరిగి వచ్చే ప్రదేశం" మక్కాను సూచిస్తుంది. దీనికి కారణం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా విజయం సాధించిన రోజున మక్కాలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది. మరొక కథనం ప్రకారం, వలస సమయంలో, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా మరియు మదీనా మధ్య ఉన్నప్పుడు, ప్రవక్త (స) మక్కా పట్ల తన ప్రేమను వ్యక్తం చేశారు. ఆ సమయంలో, దేవదూత జిబ్రాయిల్ దిగి వచ్చి ఇలా అన్నాడు: "మీ మాతృభూమి మరియు జన్మస్థలం పట్ల మీకు ఉన్న అనుబంధం గుర్తుకు వస్తుందా?" అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, "అవును" అని బదులిచ్చారు. అప్పుడు జిబ్రయిల్ ఇలా అన్నాడు: "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా ప్రకటించాడు: **ఇన్నల్లజీన ఫరజ అలైకల్ ఖుర్‌ఆన లరఅద్దుక ఇలా మఆది.** అనగా "'ఖురాన్ బోధనను మీపై విధిగా చేసినవాడు నిన్ను తిరిగి నీ స్థలానికి తీసుకు వస్తాడు.'" అంటే, అల్లాహ్ నీకు ఖురైషులపై ఆధిపత్యాన్ని ప్రసాదించి, నిన్ను మక్కాకు తిరిగి తీసుకవస్తాడు. ఎందుకంటే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో ఉన్నారు, తరువాత దానిని వదిలిపెట్టారు. చివరికి అక్కడికి తిరిగి వచ్చారు. కావున ఈ శుభవార్త మక్కా తప్ప మరే ఇతర ప్రదేశానికి తగిన విధంగా వర్తించదు.

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, పవిత్ర ఖురాన్‌లోని ఈ భవిష్యవాణి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తత్వానికి రుజువు, ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ నుండి గోప్యమైన విషయాన్ని గూర్చి తెలియజేశారు. కావున ఆ విషయం ప్రవక్త (స) తెల్పినట్లు ఉన్నది ఉన్నట్లుగా వెలుగులోకి వచ్చింది. **(తఫ్సీరుల్-కబీర్ రాజి, వాల్యూమ్. 13, దారుల్ కుతుబుల్-ఇల్మియా, బీరుట్, పేజీ. 19)**

పవిత్ర ఖురాన్‌లో మరొక చోట, మక్కా విజయం గురించి భవిష్యవాణి చేయడం జరిగింది. దీనిలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు ముస్లింలందరికి కూడా గుర్తు చేయడం జరిగింది. అదేమనగా, చూడండి! మీరు ఎక్కడికి వెళ్ళినా, చివరికి మక్కా జయించబడుతుందనే విషయాన్ని మర్చిపోకూడదు. ఇందుకోసం మీరు కూడా కృషి చేయాలి, కష్టపడి పనిచేయాలి మరియు ప్రార్థించాలి. కావున ఈ ఖురాన్ ప్రవచనంను ఆధారం చేసుకోని చూసినచో ఇప్పటి వరకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన అన్ని యుద్ధాలు మరియు సైనిక చర్యల ఉద్దేశ్యం మరియు ప్రధాన లక్ష్యం మక్కా విజయం అని మనం చెప్పగలం.

కావున ఖురాన్ యొక్క ఈ గొప్ప ప్రవచనాన్ని **వమిన్ హైసు ఖరజ్‌త ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామి** (బఖర:150) ను విశ్లేషిస్తూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి తఫ్సీర్‌లో ఇలా పేర్కొన్నారు. **వమిన్ హయిసు ఖరజ్‌త** యొక్క అర్థాన్ని "వ్యాఖ్యాతలు "మీరు ఎక్కడ ఉన్నా కూడ అన్ని వేళలా మీ ఖిబ్లాను ఖాన కాబానే చేసుకోండి అని చేశారు. ఇందుకు వారు చూపిన కారణం ఏమిటంటే, మునుపటి ఆదేశం ద్వారా ఈ ఖిబ్లా మదీనా ప్రజలకు మాత్రమే వర్తిస్తుంది మరియు ఇతరులకు వర్తించదని భావించి ఉండవచ్చు. అందుకే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ "నీవు ఎక్కడి నుండి బయలుదేరినా, నీ ముఖాన్ని పవిత్ర మసీదు వైపు తిప్పుకో." అని తెలిపాడు అని చెబుతారు. కాని హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు. "కానీ నిజం ఏమిటంటే, ఈ వచనంలో ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశించి మాట్లాడుతున్నా లేదా ముస్లింలందరినీ ఉద్దేశించి మాట్లాడుతున్నా, దీని అర్థం ఖిబ్లా వైపు తిరగడం గురించి ఏ మాత్రం కాదు, ఎందుకంటే ఒక నగరంలో లేదా పట్టణంలో నివసిస్తున్నప్పుడు చేసే ప్రార్థనలు సాధారణంగా నగరం నుండి బయలుదేరేటప్పుడు చేసే ప్రార్థనల కంటే ఎక్కువగా ఉంటాయి. అలాంటప్పుడు, ప్రయాణ స్థితిలో ఉండటం వల్ల చాలా తక్కువ పరిస్థితులకు వర్తించేలా ఆదేశించడం కంటే, ఎక్కువ సంఖ్యలో ప్రార్థనలకు వర్తించేలా ఆదేశించవలసి ఉండాలి. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఉదయం 10 గంటలకు లేదా అస్ర్ మరియు మగ్రిబ్ మధ్య లేదా మధ్యరాత్రిలో ఒక నగరాన్ని విడిచిపెట్టవచ్చు అప్పుడు ఈ సమయాలన్ని ప్రార్థన ప్రశ్న కూడా తలెత్తని సమయాలు అయి ఉంటాయి. అటువంటి పరిస్థితులలో, **వమిన్ హైసు ఖరజ్‌త ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామి** అనే ఆదేశం అర్థరహితంగా మారుతుంది. ఎందుకంటే చాలా అరుగుగా నమాజ్ సమయంలో నగరం నుండి బయలుదేరుతుంటారు. సాధారణముగా ఒకవ్యక్తి అప్పటికే ప్రార్థన చేసి ఉంటాడు లేదా ఇంకా ప్రార్థన చేయకపోతే, అతను ఆ నమాజ్‌లను తరువాత అయినా చేయవచ్చు. మొత్తానికి నమాజ్‌కు మరియు బయటికి వెళ్ళే సమయానికి ఎలాంటి ప్రత్యక్ష సంబంధం ఉండదు. ఏదేని నమాజ్ బయటికి వెళ్ళే సమయంతో ముడిపడి ఉన్నచో అప్పుడు ఆ స్థితిలో ఈ అర్థాలను మనము సరైనవిగా భావించవచ్చును. కాని నమాజ్‌కు బయటికి వెళ్ళే సమయానికి ఎలాంటి సంబంధం లేదని ప్రతి ఒక్కరికి తెలుసు. కావున ఇలాంటి పరిస్థితులలో ఈ సూక్తిని ఉద్దేశపూర్వకముగా ఇంటి నుండి బయటికి ప్రయాణంపై వెళ్ళే ఆంశంతో ముడిపెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. **మిన్ హయిస్ ఖరజ్‌త** అనగా ప్రార్థన సమయంలో ఖిబ్లా వైపు తిరగడం గురించి కాదని నిరూపించే మరొక వాదన ఏమిటంటే, ప్రయాణంలో, దిశ అనే భావన కూడా కొన్నిసార్లు వర్తించదు. ఎందుకనగా వారు ఏ దిశకు ముఖము త్రిప్పుకొని ఉంటే ఆ దిశ వైపే ప్రార్థన చేస్తారు. ఉదాహరణకు, ఒక వ్యక్తి వాహనం నుండి దిగలేకపోతే, పవిత్ర ఖురాన్ మరియు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క సాంప్రదాయం ప్రకారం అటువంటి సందర్భంలో, వారు ఏ దిశలో ముఖమును కల్గి ఉంటారో అటువైపే ప్రార్థనలు చేయవచ్చు. (ప్రయాణంలో ప్రార్థన చేస్తుంటే, ఏ దిశలోనైనా ప్రార్థనలు చేయడానికి అనుమతి ఉంది) అది ఖిబ్లా వైపు అయినా లేదా మరెక్కడైనా అయినా. అటువంటి సమయాల్లో, దిశ యొక్క సమస్య తలెత్తదు. తూర్పు, పడమర, ఉత్తరం మరియు దక్షిణం అన్నీ ఒకేలా మారుతాయి. వారి హృదయం యొక్క కేంద్ర బిందువు పవిత్ర కాబా వైపు మాత్రమే ఉండాలి. (ప్రార్థన చేస్తున్నప్పుడు, మీ దృష్టి పవిత్ర కాబా వైపు మాత్రమే ఉందని మీరు భావించాలి.) ఈ రోజుల్లో, ప్రజలు రైలులో కూర్చున్నప్పుడు, స్థిరమైన దిశ కూడా ఉండదు, ఎందుకంటే రైలు కొన్నిసార్లు ఉత్తరం, కొన్నిసార్లు దక్షిణం, కొన్నిసార్లు తూర్పు మరియు కొన్నిసార్లు పడమర వైపు తిరుగుతుంది. (విమానాల ద్వారా సుదూర ప్రయాణాలలో కూడా మనం దీనిని ఇలాగే గమనించవచ్చు.) అయినప్పటికీ, ఇలాంటి పరిస్థితులలో కూడ అక్కడ కూర్చున్న వ్యక్తులు నమాజ్ చేసినచో అతని నమాజ్‌లలో ఎలాంటి అభ్యంతరం ఉండదు. కావున ఒకవేళ విశ్లేషకుల భావాలను సరైనవిగా మనం భావించినచో, జంతువుపై స్వారీ చేసే వ్యక్తి లేదా రైలులో కూర్చున్న వ్యక్తి ఆ ఆజ్ఞను పాటించలేరు. కాబట్టి, బయలుదేరే సమయంలో దిశ స్థిరంగా లేనప్పుడు, ఈ వచనాన్ని 'మీరు ఎక్కడి నుండి బయలుదేరినా, ప్రార్థనలో కాబా వైపు తిరగండి' అని అర్థం చేసుకోవడం ఎలా సరైనది అవుతుంది?

ఈ అర్థం సరైనది కాదు అని అనడానికి గల మరొక కారణం ఏమిటనగా, ఒకవేళ ఈ సూక్తిని పదాల యొక్క సాహిత్యపరమైన అర్థంను అనగా 'మీరు ఎక్కడి నుండి బయలుదేరినా, మీ ముఖాన్ని పవిత్ర మసీదు వైపు తిప్పుకోండి', లేదా మీరు ఎక్కడి నుండి బయలుదేరినా మీ ముఖమును ఆ పవిత్ర మసీదు వైపు తిప్పండి" తీసుకున్నచో నడుస్తున్న సమయంలో నమాజ్ చదవలేము అని, నమాజ్‌ను కేవలం ఒక చోట నిలబడి మాత్రమే చదవబడుతుందని ప్రతి ఒక్కరికి తెలుసు. ఒకవేళ ఈ సూక్తికి ఈ పదాలు అనగా **హయిసు మా కున్‌త ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్** అనగా మీరు ఎక్కడ ఉన్నా కూడ మీ ముఖములను పవిత్ర మస్జిద్ వైపు త్రిప్పుకోండి అని ఉన్నచో అప్పుడు ఈ భావన సరైనదిగా భావించవచ్చును. " నీవు ఎక్కడ ఉన్నా నీ ముఖమును పవిత్ర మస్జిద్ వైపు త్రిప్పుకొనుము అనే అర్థం సరైనదిగా భావించవచ్చును. " కాని ఇక్కడ మాత్రం **మిన్ హయిస్ ఖరజ్‌త ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్** అని పేర్కొనడం జరిగింది. అనగా ఓ ముహమ్మద్ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) లేదా ఓ ముసల్మానులారా! మీరు ఎక్కడి నుండి బయలుదేరినా కూడ మీ ముఖములను పవిత్ర మస్జిద్ వైపు త్రిప్పుకోండి.

ఇక్కడ స్పష్టముగా తెలియజేయబడిన విషయమేమనగా నమాజ్ బయటికి వెళుతున్నప్పుడు చదవబడదు. ఒకచోట ఉన్నప్పుడు మాత్రమే నమాజ్ చదవబడుతుంది. కావున ఇక్కడ నమాజ్ చదవడం అని భావించడం ఎట్టి పరిస్థితులలో ను సరైనది కాదని తెలుస్తుంది. విశ్లేషకులు తెల్పు మరొక విషయమేమనగా ఒకవేళ నమాజ్ మరియు బయటికి వెళ్ళే సందర్భంను ఏదో ఒక విధముగా అంగీకరించనిచో తప్పకుండా పరస్పరం పోటి ఏర్పడుతుంది. నిజానికి ఈ ఆలోచన కూడ పొరపాటే. వారికి ఖుర్ఆన్ మజీద్‌లో భిన్నముగా ఉన్నట్లు కనిపించడానికి గల కారణం వారికి ఖుర్ఆన్ కరీం యొక్క సరైన అర్థాలు మరియు వ్యాసాల మధ్య ఉన్న అనుబంధం అర్థం కాకపోవడం. వారికి ఎక్కడ ఎలాంటి అభ్యంతరమైన సూక్తి కనిపించిన కూడ వారు వెంటనే నిష్క్రమణ మరియు ఆగమణల చర్చను ప్రారంభిస్తారు. ఒక సూక్తిని ఆగమణంగా మరొక సూక్తిని నిష్క్రమణంగా ప్రకటించి అభ్యంతరాన్ని వదిలించుకుంటారు. నిజానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రపంచానికి తెలియపర్చిన పవిత్ర ఖురాన్ యొక్క వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే, వారు ఖుర్ఆన్ కరీంలో ఎటువంటి పునరావృతం చూడరు, లేదా ఎలాంటి సూక్తులను రద్దు చేసినట్లు ప్రకటించాల్సిన అవసరం కూడా ఉండదు. "వాస్తవం ఏమిటంటే, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్రమైన మక్కా పట్టణం నుండి వెళ్ళగొట్టబడినప్పుడు, ఆ క్షణంలో ఇస్లాం శత్రువులు 'మీరు ఇబ్రాహీం ప్రార్థన నెరవేర్పులో వాగ్దానం చేయబడిన వ్యక్తి అయినచో మరియు పవిత్ర కాబాతో మీరు అనుసంధానించబడినచో, మీరు మక్కా నుండి ఎందుకు వెళ్ళగొట్టబడ్డారు?, మీరు ఇప్పుడు మక్కా నుండి వెళ్ళగొట్టబడిన తర్వాత ఇబ్రాహీం ప్రార్థన యొక్క నిజమైన అభివ్యక్తి ఎలా అవుతారు.' అని అభ్యంతరం చెప్పే అవకాశం వచ్చింది. ఈ అభ్యంతరానికి ప్రతిస్పందనగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ పదాలను ప్రకటించాడు: **మిన్ హయిస్ ఖరజ్‌త ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామి** అనగా "ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ! మీరు మక్కా నుండి వెళ్ళగొట్టబడటం తాత్కాలికం. మేము మీతో చేయు వాగ్దానం ఏమిటనగా, మీకు మళ్ళీ తిరిగి వచ్చే అవకాశాన్ని కల్పిస్తాము మరియు వాస్తవానికి మీరు మక్కాపై విజయం సాధిస్తారు. ' అయితే, దేవుడు తన దాసులతో చేసిన వాగ్దానాల విషయంలో దైవిక మార్గం వలె, వారు దానిని నెరవేర్చడానికి కృషి చేస్తారని కూడా ఆయన ఆశిస్తున్నాడు. అంతేగాని దేవుడు వారితో వాగ్దానం చేసినచో వారు చేతులు కట్టుకొని కూర్చోరు. వారు అట్టి దైవిక వాగ్దానాన్ని నెరవేర్చడానికి ప్రయత్నించరని కాదు. దేవుడు వాగ్దానం చేసాడు కాబట్టి, అతడే దానిని పూర్తిగా స్వయంగా నెరవేరుస్తాడు. దాని నెరవేర్పులో మనం పాలుపంచుకోవాల్సిన అవసరం ఏమిటి? అని ఆలోచించరు. (ప్రజలు ఇలా ఆలోచించడం మొదలుపెట్టకుండా ఉండేందుకు.) "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తాలా మూసా అలైహిస్సలాం ప్రజలకు కనాను దేశాన్ని ఇస్తానని వాగ్దానం చేశాడు. ప్రవక్త మూసా అలైహిస్సలాం తన ప్రజలతో కలిసి దాని వైపు బయలుదేరాడు. వారు అక్కడికి చేరుకున్నప్పుడు, ఆయన తన ప్రజలతో, 'మీరు వెళ్లి పోరాడి ఈ దేశాన్ని జయించండి' అని అన్నాడు. కానీ మూసా అలైహిస్సలాం సమాజీకులు సర్వశక్తిమంతుడైన దేవుడు మనకు ఈ భూమిని ఇస్తానని వాగ్దానం చేసినందున, అతడే దానిని స్వయంగా నెరవేరుస్తాడు మరియు దానిని మాకు అప్పగిస్తాడు అని భావించే పొరపాటు చేశారు. ఒకవేళ మనం ఈ భూమిని జయిస్తే, దేవుని వాగ్దానం వల్ల ఉపయోగం ఏమిటి?. సర్వశక్తిమంతుడైన దేవుడు వాగ్దానం చేసినందున, ఆయన దానిని స్వయంగా నెరవేర్చాలి. దీని కోసం మనం ఎటువంటి ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు అని భావించారు. కాబట్టి, వారు హజ్రత్ మూసా అలైహిస్సలాంకు ఇలా సమాధానమిచ్చారు: ఇజ్‌హబ్ అన్‌త వ రబ్బుక ఫఖాతిలా ఇన్నా హాహునా ఖాఇదూన్ . ...."ఓ మూసా! దేవుడు మాకు ఈ భూమిని ఇస్తాడని మీరు మాకు చెప్పేవారు. ఇప్పుడు ఈ వాగ్దానాన్ని నెరవేర్చే బాధ్యత మీపై లేదా మీ దేవునిపై ఉంది. ఈ భూమిని మేమే స్వయంగా జయిస్తే, మీరు లేదా మీ దేవుడు ఏమి చేసారు? ఈ భూమి మాకు ఖచ్చితంగా ఇవ్వబడుతుందని సర్వశక్తిమంతుడైన దేవుడు వాగ్దానం చేశాడని మీరు మాకు చెబుతారు కాబట్టి, మీరు మరియు మీ ప్రభువు వెళ్లి పోరాడండి, మేము ఇక్కడ కూర్చుంటాము. ఏమీ చేయము. మీరు భూమిని జయించి మాకు అప్పగించిన తర్వాత, మేము దానిలోకి ప్రవేశిస్తాము. బాహ్యముగా చూసినచో ఇప్పుడు వారు ఇలా చెప్పడం సరైనదే అనిపించవచ్చు ఎందుకంటే ఎవరైనా మరొకరికి ఒక నిర్దిష్ట వస్తువు ఇస్తానని వాగ్దానం చేసి, ఆ తర్వాత ఆ వ్యక్తి దానిని తీసుకోవడానికి వచ్చినప్పుడు, 'నువ్వే వెళ్లి మార్కెట్ నుండి కొనుక్కో' అని చెబితే, అందరూ ఒకవేళ అతడు ఆ వస్తువును మార్కెట్ నుండి కొనుక్కోవలసి వచ్చినచో అప్పుడు అతనితో అలా వాగ్దానపు అనవసరం ఏముంది? అని గా భావిస్తారు. "కాబట్టి, ఈ వాదన బాహ్యముగా హేతుబద్ధంగా అనిపించవచ్చు. కాని దైవిక సమాజాలకు సంబంధించి, ఇలాంటి భావన పూర్తిగా అసమంజసమైనది. అందుకే సర్వశక్తిమంతుడైన దేవుడు ఇశ్రాయేలీయులను ప్రశంసించలేదు. 'మీరు పోరాడనవసరం లేదు, భూమిని స్వాధీనం చేసుకుని మీకు అప్పగించడం మా బాధ్యత' అని దేవుడు చెప్పలేదు. బదులుగా, దేవుడు ఇలా ప్రకటించాడు: 'మీరు మమ్మల్ని అగౌరవపరిచారు. కాబట్టి, మీరు ఈ భూమిని కోల్పోతారు. వెళ్లి, నలభై సంవత్సరాలు అరణ్యంలో సంచరించండి. మీరు ఈ భూమిని వారసత్వంగా పొందరు – మీ కొత్త తరం ఈ దేశానికి వారసులవుతారు. ఎందుకంటే మీరు మమ్మల్ని అవమానించారు. చూడండి. ఈ విషయం మానవ దష్ట్యా చెల్లుబాటు అయ్యేదిగా మరియు సహేతుకమైనదిగా పరిగణించవచ్చు, కానీ దైవిక లక్ష్యం దృక్కోణం నుండి, ఇది పూర్తిగా అసమంజసమైనది మరియు దైవిక శిక్షకు అర్హమైనదిగా చేస్తుంది. కారణం ఏమిటంటే, ఒక మానవుడు వాగ్దానం చేసినప్పుడు, వారికి భూమ్యాకాశములకు సంబంధమైన మార్పులపై నియంత్రణ ఉండదు, (అంటే, ఒక వ్యక్తికి భూమి మరియు ఆకాశంలో సంభవించే మార్పులపై ఎటువంటి నియంత్రణ ఉండదు. అందువల్ల, మానవుడు తన శక్తి సామార్థ్యంకు సంబంధించిన దానిని గూర్చియే వాగ్దానం చేయగలడు. కానీ సర్వశక్తిమంతుడైన దేవుడు ఒక వాగ్దానం చేసినప్పుడు, దాని అర్థమేమనగా, ఆ వాగ్దానం నెరవేర్పు అసాధ్యంగా అనిపించినా – అది దైవిక సహాయం ద్వారా నెరవేరుతుంది.

"శతాబ్దాలుగా ఫిరౌన్ చేతిలో బానిసలుగా బ్రతికిన జాతి, అతని కోసం ఇటుకలు తయారు చేసేవారు మరియు కలపను నరికివేసేవారు. అత్యంత నీచమైన పనులలో నిమగ్నమై ఉండేవారు ఆద్ ప్రజల వంటి శక్తివంతమైన దేశం పాలించే ఇంత గొప్ప దేశాన్ని ఎలా జయించగలరు? ఈ దేశాన్ని జయించడం అంత తేలికైన పని కాదు, అయినప్పటికీ దేవుడు ఇలా అన్నాడు: 'ఈ భూమిని స్వాధీనం చేసుకోవడం మీకు అసాధ్యంగా అనిపించినప్పటికీ, మేము మీకు ఈ భూమిని ఇస్తామని మేము హామీ ఇస్తున్నాము మరియు మీరు మా సహాయం ద్వారా దానిని సాధిస్తారు.'"కాబట్టి, దైవిక వాగ్దానం అంటే ఇప్పుడు దేవుడు వాగ్దానం చేశాడు కాబట్టి దాసులకు ఎలాంటి ప్రయత్నం చేయవలసిన అవసరం లేదని కాదు. నిజానికి దాని అర్థమేమనగా, మీరు ఆ లక్ష్యం చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు, దేవుడు మీకు సహాయం చేసి మీకు విజయం చేకూర్చుతాడు. సారాంశమేమనగా, దైవిక వాగ్దానం యొక్క స్వభావానికి మరియు మానవుని స్వభావానికి మధ్య వ్యత్యాసం ఉంది. వ్యూహాత్మకత అవసరమయ్యే దైవిక వాగ్దానాలలో మానవ ప్రమేయం అవసరం ఉంటుంది. వాటిని నెరవేర్చడానికి, కష్టపడవలసి ఉంటుంది. ఒకవేళ దాని నెరవేర్చుటకు ప్రయత్నించనిచో, ప్రమేయం చూపించుటకు ప్రయత్నించనిచో వారు శిక్షకు అర్హులు అవుతారు."దీనికి విరుద్ధంగా, మానవుడు చేసిన వాగ్దానాలకు ఇది వర్తించదు. 'నేను మీ కోసం దైవిక విధిని మారుస్తాను' అని ఏ మానవుడు చెప్పలేడు. ఎందుకంటే ఇది మానవ నియంత్రణలో లేదు. ఎవరైనా అలాంటి వాదన చేస్తే, వారిని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విధిని మార్చడానికి మీరు ఎవరు?' అని ప్రశ్నిస్తాడు. కాని దేవుడు ఇలా చెప్పగలడు: 'మీరు నా ఆజ్ఞ ప్రకారం నడుచుకుని దీని కోసం ప్రయత్నిస్తే, నేను మీకు సహాయం చేస్తాను మరియు విధిని మారుస్తాను,' ఎందుకంటే విధి దేవుని శక్తిలో ఉంది మరియు దేవుడు దానిని తనకు నచ్చిన విధంగా మార్చవచ్చును."మక్కా విజయం యొక్క దైవిక వాగ్దానాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంకు ఇచ్చినప్పుడు, దీనితో పాటు ముస్లింలనుఇలా హెచ్చరించారు: 'ఓ ముస్లింలారా! దేవుడు మక్కాను అనుగ్రహిస్తాడని వాగ్దానం చేసినందున మీరు హజ్రత్ మూసా అలైహిస్సలాం జాతి ప్రజలే వలే దేవుడే అట్టి వాగ్దానమును నెరవేరుస్తాడు, మనకు ఇందుకు కోసం ఎలాంటి ప్రయత్నం చేయనవసరం లేదని భావించకండి. " నిజానికి, మీరు కూడా దానిని నెరవేర్చడానికి కృషి చేయాలి.'

"దేవుని వాగ్దానం అంటే: 'మీరు బలహీనులు – మీరు బలహీనులు కాకపోతే, మీరు మక్కాను ఎందుకు వదిలి వెళ్ళేవారు? మక్కాను విడిచిపెట్టడం మీ బలహీనతను సూచిస్తుంది మరియు మీ శత్రువు బలవంతుడు. కానీ దేవుడు మీకు బలాన్ని ఇస్తాడు మరియు మీరు మీ విరోధుల నుండి మక్కాను తిరిగి పొందుతారు.' "కాబట్టి, **వమిన్ హయిసు ఖరజ్‌త ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్** యొక్క అర్థమేమనగా, మీరు ఎక్కడి నుండి బయలుదేరినా, లేదా మీరు ఏ ప్రాంతం నుండి బయలుదేరినా మనం మక్కాను జయించాలి అనే లక్ష్యం మీకు ఉండాలి. ఇక "'ఖురూజ్' అనే పదం సైనిక దండయాత్రల అర్థాన్ని కూడా కలిగి ఉంటుంది. ఆ సందర్భంలో, ఆ వచనం అర్థం: 'మీరు ఎక్కడ సైనిక దాడి ప్రారంభించినా , ఏ ప్రాంతానికైన పోరాటానికి వెళ్ళిన, అప్పుడు మీరు తూర్పు, పడమర, దక్షణం లేదా

ఉత్తరం అయినా – మీ లక్ష్యం మక్కా విజయానికి పునాది వేయడమే అయి ఉండాలి.' ఉదాహరణకు, మీరు దక్షిణం నుండి వచ్చిన శత్రువుపై దాడి చేయాలని ప్లాన్ చేస్తే, కానీ పశ్చిమాన ఉన్న వారి మిత్రులు వెనుక నుండి మీపై దాడి చేయగలరని తెలుసుకుంటే, మొదట పశ్చిమంపై దాడి చేయడం అనేది దక్షిణ దండయాత్ర వైపు ఒక ప్రాథమిక అడుగు అనబడుతుంది.. అదేవిధంగా, వారి మిత్రులు ఉత్తరాన నివసిస్తుంటే మరియు మీరు మొదట వారిపై దాడి చేస్తే, ఇది కూడా దక్షిణాన ఉన్న వారిని ఓడించే అసలు ఉద్దేశ్యానికి ఉపయోగపడుతుంది."ఈ సూత్రాన్ని సూచిస్తూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా అంటున్నాడు: 'ఓ ముస్లింలారా! మీరు ఏ ప్రాంతం ప్రజలపైనా, ఏ దేశ ప్రజలపైనా, ఏ ప్రాంతంపైనా అయినా దాడి చేసినచో మీ దాడి యొక్క నిజమైన ఉద్దేశ్యం మక్కా విజయమై ఉండాలి. ఎందుకంటే అల్లాహ్ మీకు దాని విజయాన్ని అందించాలని అనుకుంటున్నాడు.'"ఈ క్రమంలో మనం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధాలను మరియు దండయాత్రలను అధ్యయనం చేసినప్పుడు, ఈ సూత్రం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రవక్త (స) సైనిక దండయాత్రలన్నింటి యొక్క ప్రధాన ఉద్దేశ్యం మక్కాపై అంతిమ విజయం తప్ప మరొకటి కాదు. ఏ యుద్ధంలోనైనా, ఈ లక్ష్యం నెరవేరలేదని ప్రవక్త (స) భావించినచో లేదా ఒక నిర్దిష్ట జాతితో యుద్ధం చేయడం వలన అది మక్కా విజయాన్ని ఆలస్యం చేసే ప్రమాదం ఉన్నదని గ్రహించినచో ఒకవైపు రెచ్చగొట్టబడినప్పటికీ, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దానిలో పాల్గొనకుండా పూర్తిగా దూరంగా ఉండేవారు లేదా మౌనంగా ఉండేవారు. "చాలా తెగలు ప్రవక్త (స)ను సవాలు చేసి, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించాయి, కానీ ఆ సమయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహనంతో మరియు ఓర్పుతో వ్యవహరించేవారు. అయితే, ఏదేని తెగను ఓడించడం వలన మక్కా విజయానికి మార్గాన్ని సుగమం అవుతుందని ప్రవక్త (స) భావించినచో వారు చేసే సవాలుకు స్పందనగా ప్రవక్త (స) తప్పకుండా యుద్ధం చేసేవారు.ఒకవేళ అన్ని ఇస్లామిక్ యుద్ధాలను విశ్లేషించినచో వాటి వెనుక లోతైన, దైవిక మార్గదర్శక జ్ఞానం వెల్లడిస్తుంది – ముఖ్యంగా మక్కా విజయానికి ముందు జరిగిన యుద్ధాలు, ఆ విజయానికి మార్గం సుగమం చేయడమే దీని ఏకైక లక్ష్యం.

ఒకవేళ ఈ సూక్తి యొక్క అర్థం: 'నువ్వు ఎక్కడ ఉన్నా, నీ ముఖాన్ని ఖిబ్లా వైపు తిప్పుకో' అయితే, ముందు చెప్పినట్లుగా, ఈ పదాలు: మిన్ హైసు ఖరజ్త ఈ సూక్తిలో ఉండేవికావు. అందుకు బదులుగా అక్కడ "నువ్వు ఎక్కడ ఉన్నా, ఖిబ్లా దిశ వైపు తిరుగు' అనే పదాలు ఉండేవి. ఖిబ్లా వైపు తిరగమని సూచించడానికి 'నువ్వు ఎక్కడ ఉన్నా' అనే పదాలను ఉపయోగించాలి. అంతేగాని మీరు ఎక్కడి నుండి బయలుదేరినా మీ ముఖాలను ఖిబ్లా వైపు త్రిప్పుకొనుము అని కాదు. ఎందుకంటే బయలుదేరే సమయంలో ప్రజలు ప్రార్థన చేయరు, బదులుగా వారు నడవడానికి సిద్ధమవుతారు. "కాబట్టి, ఈ సూక్తికి ప్రార్థనలతో ఎటువంటి సంబంధం లేదు. వాస్తవానికి, ఈ సూక్తి యొక్క ఏకైక అర్థం ఏమిటంటే, మీరు ఎక్కడి నుండి బయలుదేరినా, అది తూర్పు వైపు ఉన్న ప్రదేశం అయినా లేదా పడమర వైపు ఉన్న ప్రదేశం అయినా, అది ఉత్తరం వైపు ఉన్న ప్రదేశం అయినా లేదా దక్షిణం వైపు ఉన్న ప్రదేశం అయినా, మీ దిశ మక్కా వైపు ఉండాలి. మరో మాటలో చెప్పాలంటే, మీ దృష్టి, మీ ఆలోచనలు మరియు మీ మనస్సు మక్కాపై విజయం సాధించాలి మరియు ఇస్లాంను స్థాపించడం ద్వారా మొత్తం అరేబియాను దాని ప్రభావంలోకి తీసుకురావాలి అనే వాస్తవంపై మాత్రమే కేంద్రీకరించబడాలి.

"వుజుహున్ అంటే 'దిశలు' అని కూడా అర్థం. అందువల్ల, దీని అర్థం మీకు ఒకే ఉద్దేశ్యం ఉండాలి. పవిత్ర కాబాను జయించి దానిని ఇస్లాం కేంద్రంగా మార్చడం, ఎందుకంటే మక్కాలో ఇస్లాం వ్యాపించే వరకు, మక్కా ముస్లింల పాలనలోకి రానంత వరకు, మిగిలిన అరేబియా ప్రాంతీయులు ముస్లింలుగా మారరు. ఇది ముస్లింల కోసం స్థాపించబడిన కార్యక్రమం, మరియు ఈ కార్యక్రమం నిస్సందేహంగా వారి సామర్థ్యాలకు మించినది. అరేబియాలో అధికారిక ప్రభుత్వం లేనప్పటికీ, పూర్తి స్వతంత్ర్యముగా కూడా లేదు. వారు వివిధ రాజులతో, రాజ్యాలతో ఒప్పందాలు మరియు సంధి వంటివి ఏర్పరుచుకునేవారు."అదేవిధంగా, మక్కా కూడ అధికారికంగా పాలించబడకపోయినా, అది 1.5 నుండి 2 మిలియన్ల జనాభా కలిగిన దేశానికి రాజధాని. చుట్టుపక్కల తెగలు దాని వైపు చూసేవి. మరియు వారి నిర్ణయాలకు మరియు చట్టాలకు కట్టుబడి ఉండేవి. అప్పుడు, ఆ కాలాల ప్రకారం, అది 15 నుండి 16 వేల జనాభా కలిగిన చాలా పెద్ద నగరం. మరియు ఈ నగరంలోనే కాదు, దేశ జనాభాలో 1.5 నుండి 2 మిలియన్ల మంది పురుషులందరు సైనికులు మరియు యుద్ధంలో చాలా నైపుణ్యం కలిగియున్నవారు. వారు యోధులు, ధైర్యవంతులు మరియు కలహకారులు. వారితో పోరాడటం ముసల్మానులకు అంత సులభం కాదు. ఈ సూక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పై అవతరించిన సమయంలో, ముస్లింల వద్ద 400 నుండి 500 మంది సైనికులు లేదా గరిష్టంగా వెయ్యి మంది సైనికులు మాత్రమే ఉన్నారు. మహిళలు మరియు పిల్లలు సహా, వారి సంఖ్య మొత్తం 11,000 లేదా 12,000 మంది ఉండేది. అంతకు మించిన ముస్లిం సంఖ్య లేదు. వారి సైనిక బలం చెప్పుకోదగినది కాదు. అయినప్పటికీ, ముస్లింలు చాలా బలహీన స్థితిలో ఉన్నప్పటికీ, వారి సంఖ్యను అవిశ్వాసులతో పోల్చదగినంతగా కూడ లేనప్పటికి, వారి ఎలాంటి ఆయుధాలు లేని పరిస్థితులలో, అవిశ్వాసులతో పోలిస్తే వారికి ఎటువంటి సైనిక బలం లేనప్పటికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అవిశ్వాసులకు ఒక సవాలు విసిరాడు. అదేమనగా, ఈ ముస్లింలు సంఖ్యలో తక్కువగా ఉన్నప్పటికి, బలహీనులు మరియు శక్తిహీనులు అయినప్పటికి, ఈ ముస్లింలే ఒక రోజు మీ దేశాన్ని జయిస్తారు. మీ రాజధానిని వారు స్వాధీనం చేసుకుంటారు. వారికి ఎంతటి విజయం వరిస్తుందనగా, వారు అక్కడి నుండే ఇస్లాం చట్టాలను ఆచరింప జేస్తారు మరియు అరేబియా భూభాగం నుండి అవిశ్వాసాన్ని పూర్తిగా నిర్మూలిస్తారు. ఈ వాగ్దానం ముస్లింల పరిస్థితి దృష్ట్యా ఒక అద్భుత వాగ్దానం. మరియు ఈ వాగ్దానం ఒక నిర్దిష్ట ప్రాంతానికి పరిమితం కాదు. ఈ వాగ్దాన ప్రభావం చాలలా విస్తృతమైనది మరియు విస్తారమైనది. ఎందుకంటే ఇందులో కేవలం మక్కాపై విజయంను గూర్చి చెప్పబడలేదు, అరేబియా విజయంను గూర్చియే ప్రకటించబడలేదు. నిజానికి ఇందులో క్రైస్తవ మతంను గూర్చి కూడా సవాలు చేయబడింది, యూదు మతంను గూర్చి కూడా సవాలు చేయబడింది. జోతిష్య మతస్థులను గూర్చి కూడా సవాలు చేయబడింది మరియు ఇస్లాం ఈ మతాలన్నింటినీ అధిగమించి మొత్తం ప్రపంచంపై విజయం సాధిస్తుందని గొప్ప నిజాయితీతో ప్రకటించబడింది. ఈ వాగ్దానం ఒక అద్భుత వాగ్దానం. అందుకే అవిశ్వాసులు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను నవూజుబిల్లాహ్ పిచ్చివాడు, అని పిలిచేవారు మరియు సహచరులను కూడా పిచ్చివాళ్ళుగా భావించేవారు. ఎందుకంటే వారు చేస్తున్నట్లు వంటి వాగ్దానం నెరవేరడానికి వారికి ప్రాపంచిక పరమైన ఏ మార్గంను కూడ చూడలేకపోయారు. అయితే, వాస్తవికత ఏమిటంటే, అసాధారణమైన విషయాలు జరగాలంటే, ప్రతి వ్యక్తిలో ఒక నిర్దిష్ట స్థితి ఏర్పడనంత వరకు, కొన్ని పరిస్థితులలో దీనిని వైద్య పరిభాషలో మోనోమానియా (ఒక విషయంపై పూర్తిగా దృష్టి పెట్టడం) గా పరిగణిస్తారు. అనగా కేవలం ఒకే విషయంపై దృష్టిని కేంద్రీకరించడం. ఎప్పటి వరకైతే వారు మిగిలిన ఉద్దేశాలన్నింటిని మరచిపోనంత వరకు, ఎప్పటి వరకైతే ఒక రకమైన స్థిరమైన అశాంతి మరియు ఆందోళన రానంత వరకు మరియు అసాధారణ పనుల పట్ల మానవునికి ప్రత్యేకమైన మక్కువ ఏర్పడనంత వరకు, అతను ఈ పనులలో ఎప్పటికీ విజయం సాధించలేడు. "ఈ వాక్యంలో పవిత్ర ఖురాన్ ఈ విషయంపై దృష్టి సారించింది. మీరు మిగతావన్నీ మరచిపోయి, దీన్ని మీ ఏకైక లక్ష్యంగా చేసుకోవాలి. ఇస్లాం కొరకు మనం మక్కాను జయిస్తాము. ఈ కేంద్రంను మరియు ఈ కోటను జయించనంత వరకు, మీరు అరేబియా అంతటా, లేదా మొత్తం ప్రపంచంలో ఎక్కడ విజయం సాధించలేరు. ఇక్కడ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ 'మీరు ఎక్కడి నుండి బయలుదేరినా, మీరు పవిత్ర మసీదు వైపు తిరగండి' అని అన్నాడు కాని, 'మీరు ఏ దిశలో దాడి చేసినా, పవిత్ర మసీదుపై దృష్టి పెట్టండి' అని ఎందుకు చెప్పలేదనే ప్రశ్న తలెత్తుతుంది? సమాధానం ఏమిటంటే, బయలు దేరే సమయంలోనే మన ఈ దాడి యొక్క ఉద్దేశ్యం ఏమిటి? అనే విషయాన్ని గురించి నిర్ణయం తీసుకోబడుతుంది. అంతేగాని యుద్ధం మొదలు పెట్టిన తరువాత లక్ష్యంను గూర్చి తరువాత ఆలోచించరు. అందువలన ఇక్కడ మక్కా విజయాన్ని దృష్టిలో ఉంచుకోవడం వైపు దృష్టిని ఆకర్షించడమే లక్ష్యం కాబట్టి, మీరు యుద్ధాన్ని ప్రారంభించే సమయంలో, మక్కా విజయానికి మీ యుద్ధం ఏ విధముగా ప్రభావిత పరుస్తుంది అని ఆలోచించవలెను. ఒకవేళ ఆ యుద్ధం మక్కా విజయానికి సహాయపడకపోతే దానిని వదిలివేయండి. అంతమాత్రమున ఇస్లాం దాని అనుచరులకు హింసాత్మక దాడికి అనుమతి ఇస్తుందని అర్థం కాదు. ఎందుకనగా ఈ సూక్తి అవతరించడానికి ముందే అవిశ్వాసులతో యుద్ధాలు ప్రారంభమయ్యాయని చరిత్ర సాక్ష్యమిస్తుంది. ఈ విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి: **మిన్ హైయిస్ ఖరజ్త** లో కేవలం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశించి చెప్పడం జరిగింది. ఇందుకు కారణం ఏమిటనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత మక్కాపై ఇంతపెద్ద ఎత్తున దాడి చేయవలసిన అవసరమే లేదు. ఎందుకనగా ప్రవక్త (స) తరువాత మక్కాపై ఎలాంటి దాడి జరుగదు. నిజానికి ఆ మక్కా నగరం సంపూర్ణ స్థాయిలో ముసల్మానుల ఆధీనంలోనే ఉండును. కావున ఈ సూక్తిలో భవిష్యత్తును గూర్చికూడ భవిష్యవాణి చేయడం జరిగింది. అనగా మక్కాను

బాహ్యముగా మరొకసారి జయించవలసిన అవసరం ఉండదు. ఎందుకంటే మక్కా వైభవాన్ని సుస్థిరపర్చునట్టి ఒక ఆచరణాత్మకమైన సమాజం సృష్టించబడుతుంది. పైగా ఆ నగరం ఎల్లప్పుడు ముస్లింల ఆధీనంలోనే ఉంటుంది." **(తఫ్సీర్-ఎ-కబీర్, వాల్యూమ్, 3, పేజీలు 11-18, ముద్రణ 2022)**

ఈ వ్యాఖ్యానం మరియు పరిచయం యొక్క అవసరం ఎందుకనగా మక్కా విజయానికి సంబంధించిన సంఘటనల ప్రస్తావన ముందు రాబోతున్నది. కావున ఈ నేపథ్యంతో ఆయా ఘటనలను అర్థం చేసుకోవడానికి ఈ వ్యాఖ్యానం సహాయ పడుతుంది. మిగిలిన విషయాలను తదుపరి జుమాలో ప్రస్తావిస్తాను, ఇన్షా-అల్లాహ్.

ఈ సమయంలో, నేను ఒక అమరవీరుడి గురించి కూడా ప్రస్తావిస్తాను మరియు జుమా నమాజ్ తర్వాత వారి జనాజ నమాజ్ ను చదివించుతాను. షేక్ ముబష్షిర్ అహ్మద్ సాహిబ్ దిల్లి గారి కుమారుడు సర్గోధాలో ఉంటున్న డాక్టర్ షేక్ ముహమ్మద్ మహమూద్ సాహిబ్ గారిది. అహ్మదీయత్ వ్యతిరేకులు మే 16న కాల్పులు జరిపి వారిని హతమార్చారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్. వివరాల ప్రకారం, సంఘటన జరిగిన రోజు డాక్టర్ సాహిబ్ తన కుటుంబంతో కలిసి తాను ప్రాక్టీస్ చేసిన సర్గోధాలోని ఫాతిమా ఆసుపత్రికి జుమా నమాజ్ తరువాత తిరిగి వెళ్ళున్నాడు. అతను ఆసుపత్రిలోకి ప్రవేశించి, ప్రధాన ద్వారం దాటి, అత్యవసర గది దాటి కారిడార్‌కు చేరుకుని, తన గది వైపు నడుచుకుంటూ వెళుతుండగా, అప్పటికే అక్కడ ఉన్న ఒక వ్యక్తి అతనిని అనుసరిస్తూ షాపింగ్ బ్యాగ్ నుండి పిస్టల్ తీసి అతని వెనుక భాగంలో కాల్చాడు. అతని గుండా వెళ్ళిన రెండు బుల్లెట్లు అతనిని తాకాయి. అతన్ని వెంటనే సివిల్ ఆసుపత్రికి తరలించారు. అయితే, డాక్టర్ సాహిబ్ గాయాలను భరించలేకపోయారు. ఫలితముగా అమరుడైనారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్. ఈ సంఘటన తర్వాత, దుండగుడు తన ఆయుధాన్ని చూపిస్తూ, ఒక సహచరుడితో పాటు మోటార్ సైకిల్ పై ఆసుపత్రి వెలుపల నుండి పారిపోయాడు. అమరవీరుడి వయస్సు 59 సంవత్సరాలు. తన ముత్తాత, గౌరవనీయుడైన బాబు ఎజాజ్ హుస్సేన్ సాహిబ్ సోదరుడు హజ్రత్ సర్ఫ్రాజ్ హుస్సేన్ డెహ్ల్వీరా ద్వారా అహ్మదీయత్ అమరవీరుడి కుటుంబానికి పరిచయం అయ్యింది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైఅత్ చేసి అహ్మదీయత్‌ను అంగీకరించే గౌరవం అతనికి లభించింది. తదనంతరం, అమరవీరుడి ముత్తాత, ఢిల్లీకి చెందిన గౌరవనీయుడైన బాబు ఎజాజ్ హుస్సేన్ సాహిబ్ కూడా తన సోదరుడి ప్రభావంతో బైఅత్ చేశాడు. అమరవీరుడి ముత్తాత బాబు ఎజాజ్ హుస్సేన్ సాహిబ్ మరియు తాత బాబు నజీర్ అహ్మద్ సాహిబ్ ఇద్దరూ ఢిల్లీలో జమాత్ కు అమీర్లుగా వరుసగా సేవలందించే గౌరవం పొందారు. అమరవీరుడు లాహోర్‌లోని ఎఫ్, సి కళాశాల నుండి తన ఎఫ్.ఎస్ సి పూర్తి చేసి, తరువాత రావల్పిండి మెడికల్ కాలేజీలో చేరి, 1990లో ఎంబిబిఎస్ డిగ్రీతో పట్టభద్రు డయ్యాడు. ఎంబిబిఎస్ పొందిన తర్వాత, అతను పంజాబ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో ఉత్తీర్ణుడై లాహోర్‌లోని సర్వీసెస్ హాస్పిటల్ మరియు జిన్నా హాస్పిటల్‌లో నాలుగు సంవత్సరాలు పనిచేశాడు. 1998లో, అతనికి రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ యు.కే సభ్యత్వం లభించింది మరియు 2021లో, అదే సంస్థ నుండి ఫెలోషిప్‌తో సత్కరించబడ్డాడు. మృతుడు 2001లో సర్గోధకు వెళ్ళాడు, ప్రధానంగా మానవాళికి సేవ చేయాలనే కోరికతో ప్రేరేపించబడ్డాడు. అతను సర్గోధ జిల్లాలో కాలేయం మరియు కడుపు వ్యాధుల చికిత్సలో మొదటి నిపుణుడు అయ్యాడు. సర్గోధలో, అతను ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు, అక్కడ అతను ఆసుపత్రి యజమానితో అద్భుతమైన సంబంధాన్ని కొనసాగించాడు. అయితే, యజమానికి రాజకీయ నేపథ్యం ఉంది మరియు 2018లో జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకున్నాడు. మతపరమైన మతాధికారుల నుండి బెదిరింపులను ఎదుర్కొని, యజమాని వైద్యుడిని ఆసుపత్రిని విడిచిపెట్టమని మరియు అతను ఇకపై అక్కడ పని చేయలేనని కోరవలసి వచ్చింది. తత్ఫలితంగా, డాక్టర్ సాహిబ్ అక్కడి నుండి వెళ్ళిపోయి మరొక ఆసుపత్రిలో చేరాడు.

2001లో సర్గోధాకు మారినప్పటి నుండి, ఆయన రబ్వాలోని ఫజల్-ఎ-ఉమర్ ఆసుపత్రిలో విజిటింగ్ ఫిజీషియన్‌గా క్రమం తప్పకుండా సమయం కేటాయించారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు స్వస్థత చేకూర్చే సామర్థ్యాన్ని ప్రసాదించాడు మరియు అనేక మంది రోగులు ఆయన చికిత్స నుండి గణనీయంగా ప్రయోజనం పొందారు. ఆయన లౌకిక జ్ఞానంతో పాటు, ఆయన మతపరమైన అధ్యయనాలలో లోతుగా ప్రావీణ్యం కలిగి ఉన్నారు, ఖురాన్ వ్యాఖ్యానం, తజ్కిరా, రూహానీ ఖజాయిన్ మరియు ఫిక్కా సాహిత్యంతో సహా ఇతర జమాత్ సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు. ఆయన జమాత్‌కు సర్గోధా జిల్లాకు చెందిన నాయబ్ అమీర్‌గా కూడా సేవలందించారు. ఆయన మెడికల్ అసోసియేషన్ స్థాపించిన తర్వాత దానిలో చురుకుగా పాల్గొన్నారు, 2024లో దాని ఉపాధ్యక్షు డయ్యారు. ఆయన సర్గోధా చాప్టర్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. గత మూడు సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ తన సొంత అనారోగ్యాల కంటే ఇతరుల అనారోగ్యాలకే ప్రాధాన్యత ఇచ్చారు మరియు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. రోగుల పట్ల ఆయనకున్న కరుణ మరియు ప్రేమ అసాధారణమైనవి, తరచుగా అవసరమైన వారికి ఉచిత చికిత్స అందించడం, వారి తిరుగు ప్రయాణాలకు ఛార్జీల డబ్బును కూడా ఇవ్వడం జరిగింది. కొంతమంది రోగుల వైద్య పరీక్షలకు కూడా ఆయన వ్యక్తిగతంగా చెల్లించేవారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా, సర్గోధా జిల్లాలో కాలేయం మరియు కడుపు వ్యాధులకు ఆయన మొదటి నిపుణుడు. ఆర్థికంగా వెనుకబడిన బాలికల వివాహాలకు ఆయన నిశ్శబ్దంగా మరియు గణనీయంగా దోహదపడ్డారు. అలాంటి ఒక వ్యక్తి డాక్టర్ సాహిబ్ చాలా కాలం పాటు క్రమం తప్పకుండా తనకు ఆర్థికంగా సహాయం చేసేవాడని వివరించాడు. ప్రారంభంలో, ఈ వ్యక్తి నెలకు ఒకటి లేదా రెండుసార్లు సందర్శించేవాడు, కానీ క్రమంగా ప్రతి రెండు లేదా మూడు రోజులకు ఒకసారి సందర్శించడం ప్రారంభించాడు. ఈ తరచుగా ఎక్కువైనప్పటికీ, డాక్టర్ సాహిబ్ అతనికి మద్దతు ఇవ్వడం కొనసాగించాడు. ఒక సందర్భంలో, ఈ వ్యక్తి అసమంజసమైన డిమాండ్ చేసినప్పుడు, సాధారణంగా ఎప్పుడూ కోపం తెచ్చుకోని మరియు సౌమ్య స్వభావాన్ని కలిగి ఉండే డాక్టర్ సాహిబ్ అనుకోకుండా కఠినంగా మాట్లాడాడు. అతని సహజమైన స్వభావం మరియు భక్తి కారణంగా, అతను కఠినంగా మాట్లాడినందుకు రాత్రంతా విశ్రాంతి లేకుండా ఉండి, మరుసటి రోజు ఆ వ్యక్తికి ఫోన్ చేసి, హృదయపూర్వకంగా క్షమాపణలు చెప్పాడు మరియు గణనీయమైన ఆర్థిక సహాయం అందించాడు.

వారు జమాత్ పెద్దలను ఎంతో గౌరవించేవారు. మరియు అవసరమైనప్పుడల్లా రోగులకు చికిత్స చేయడానికి తరచుగా రబ్వాకు ప్రత్యేకంగా వెళ్లేవాడు.

వారి తల్లి అమతుల్ హయ్యీ సాహిబా ఇలా వ్రాసారు. మృతుడు తన తల్లిదండ్రులను ఎంతో గౌరవించేవాడని, వారు అడగకుండానే వారి అవసరాలన్నింటినీ తీర్చేవాడని పేర్కొంది. ఆమె ఎప్పుడూ దేని కోసం అడగలేదు, కానీ ఆయన ఎల్లప్పుడూ ఆమె అవసరాలను తీర్చేవాడు. ఆయన బాల్యం నుండే అనేక ప్రశంసనీయ లక్షణాలను ప్రదర్శించారు, తన సొంత పనిలో నిమగ్నమయ్యారు, ఖిలాఫత్ పట్ల ప్రగాఢమైన నిబద్ధత కలిగి ఉన్నారు, పేదలు మరియు రోగుల పట్ల ఎంతో శ్రద్ధ వహించేవారు మరియు ఆర్థిక లావాదేవీలను చాలా జాగ్రత్తగా నిర్వహించేవారు. ఆయన మొత్తం కుటుంబాన్ని కలిసి ఉంచారు.

మృతుని భార్య అమతుల్ నూర్ సాహిబా ఇలా తెలిపారు. తమ పిల్లలు జమాత్‌తో అనుబంధంగా ఉండాలని వారు నిరంతరం సలహా ఇచ్చేవారని పేర్కొన్నారు. ఖిలాఫత్ పట్ల ఆయనకున్న అభిమానం అసాధారణమైనది, క్రమం తప్పకుండా ఉపన్యాసాలు వింటూ, డైరీలో అంశాలను జాగ్రత్తగా నమోదు చేసుకునేవారు - జీవిత భక్తులతో సహా కొద్దిమంది మాత్రమే ఈ ఆచారాన్ని నిరంతరం అనుసరిస్తారు. జుమా ప్రసంగం నుండి ప్రయోజనం పొందేలా మృతుడు అనేక అంశాలను సేకరించేవారు. ఆర్థిక త్యాగాలకు ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమైనది. మృతుడు వీరమరణం పొందిన సమయంలో, వసియ్యత్ చందా 2025 వరకు పూర్తిగా చెల్లించబడింది.

మృతునికి నలుగురు పిల్లలు ఉన్నారు, వారిలో ఇద్దరు కుమారులు - వారిలో ఒకరు వైద్యుడు - మరియు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఖిలాఫత్‌తో బలమైన బంధాన్ని కొనసాగించాలని మృతుడు ఎల్లప్పుడూ ఎలా నొక్కిచెప్పారో ఆయన కుమారుడు డాక్టర్ బసిర్ వివరిస్తున్నారు. మృతుని కుమార్తె సైమా, ఆయనను అసాధారణమైన ప్రేమగల తండ్రిగా అభివర్ణించారు, ఆమె వివాహం తర్వాత తన అత్తమామలతో కలిసి వెళ్లిన తర్వాత, ఆమె జమాత్‌తో అనుబంధంగా ఉండాలని మరియు జమాఅత్‌కు సేవ చేయు అవకాశం మరియు గౌరవాన్ని ఎప్పుడూ తిరస్కరించకూడదని సలహా ఇచ్చారు. జమాత్ సేవను సాధారణ కార్యకలాపాలలో కూడా ఏకీకృతం చేయడానికి మృతుడు నిరంతరం మార్గాలను వెదికేవారని ఆమె పేర్కొంది.

మృతుని ఒక కోడలు ఇలా తెలిపారు. అల్లాహ్ పై నమ్మకం ఉంచడంపై ఎంతగానో నొక్కి చెప్పేవారు. మార్గదర్శకత్వం అడిగినప్పుడల్లా, మృతుడు ఎల్లప్పుడూ ప్రార్థనలతో తన సలహాను ప్రారంభించి ముగించేవాడు.

మృతుని సోదరి ఇలా తెల్పినది:జమాత్ పట్ల వ్యతిరేకత తనను తీవ్రంగా బాధపెట్టింది. అతను నిరంతరం స్వచ్ఛంద ప్రార్థనలు మరియు తహజ్జుద్ నమాజ్‌లు చేసేవాడు.

సర్గోధా జిల్లా అమీర్, ఖలీద్ మహమూద్ సాహిబ్ ఇలా తెలిపారు. మృతుడు గొప్ప మానవతావాది, వినయం మరియు మానవాళికి సేవ చేయడం ద్వారా గుర్తించబడిన వినయపూర్వకమైన వ్యక్తిగా నిలిచారు. ఎక్కువ సమయం అతను పేద రోగుల ఫీజులను తిరిగి ఇచ్చేవాడు. జమాత్ కోసం త్యాగాలు చేయడం అతని ముఖ్యమైన లక్షణాలలో ఒకటి. తన చందా మరియు వాగ్దానాలు మొదలైన వాటిని చెల్లించడంతో పాటు, అతను అదనపు త్యాగాలు చేయడం ద్వారా సహాయం చేసేవాడు. జమాత్ సేవకుల పట్ల మృతుడు చాలా గౌరవం చూపించేవాడు.

సర్గోధా జమాత్ మిషనరీ జుబైర్ సాహిబ్ ఇలా తెలిపారు. "చాలా ప్రియమైన వ్యక్తి మన నుండి నిష్క్రమించాడు. అతను మానవత్వ సేవకుడు, దయ మరియు దాతృత్వానికి ప్రతిరూపం. లక్షలాది మందిని స్వస్థపరిచిన వ్యక్తి, అతను ఖిలాఫత్ అభిమాని మరియు వ్యక్తిత్వం కలిగిన దేవదూత. మృతుడు ఒక దర్విష్, మరియు వారి జీవితంలోని ప్రతి అంశం ఆదర్శప్రాయమైనది. జీవిత సమర్పితులు అతని వద్దకు వచ్చినప్పుడల్లా, అతను తన కుర్చీ నుండి లేచి నిలబడేవారు మరియు వారు వెళ్ళినప్పుడు కూడా అతను వారిని తలుపు వరకు సాగనంపేవారు. ఆయన ఇంకా ఇలా అంటున్నాడు: "పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని, భద్రతా చర్యల కోసం ఒక సెక్యూరిటీ గార్డును లేదా ఖాదీమ్‌ను నియమించుకోవాలని చెప్పినప్పుడు, డాక్టర్ సాహిబ్ ఇలా సమాధానమిచ్చాడు: 'నేను నిజంగా భద్రత కోసం నాతో ఒక గార్డును లేదా ఒక సహాయకుడిని ఉంచుకోగలను, కానీ ఎవరైనా నన్ను చంపడానికి వస్తే, మరొక వ్యక్తి నా వల్ల ప్రాణాలు కోల్పోవచ్చు అనే ఆలోచనను నేను భరించలేను.' "ప్రత్యర్థులు జిల్లా అంతటా అతను మరణశిక్షకు అర్హుడని మరియు అలాంటి శిక్షకు అర్హుడని రెచ్చగొట్టే కరపత్రాలను పంపిణీ చేసినప్పటికీ, అతను అలాంటి బెదిరింపులను ఎప్పుడూ పట్టించుకోలేదు. లక్ష్యంగా చేసుకోనిన అహ్మదీల ప్రత్యర్థుల జాబితాలో డాక్టర్ సాహిబ్ పేరు అగ్రస్థానంలో ఉంది. వాస్తవానికి, ఒక మతాధికారి అక్రమ్ తూఫానీ ఉన్నాడు, అతను చంపబడటం చట్టబద్ధమని ప్రకటిస్తూ ఒక శాసనాన్ని కూడా జారీ చేశాడు మరియు ఆ శాసనాన్ని కూడా బహిరంగంగా పంపిణీ చేశాడు. అయినప్పటికీ, ఇవన్నీ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేదు."

క్రైస్తవ ఆసుపత్రి అయిన ఫాతిమా హాస్పిటల్ నిర్వాహకుడు, స్వయంగా పాస్టర్ కూడా ఇలా వ్యాఖ్యానించాడు:"మానవతా సేవకుడు మరియు గొప్ప వ్యక్తి మన నుండి నిష్క్రమించారు. మా హృదయాలు దుఃఖంతో మునిగిపోయాయి." నిజానికి, క్రైస్తవుడైన ఈ పెద్దమనిషి, ఆసుపత్రి పరిపాలనా సిబ్బంది మరియు ఇతర సహోద్యోగులతో కలిసి మృతుడి అంత్యక్రియలకు హాజరు కావడానికి రబ్వాకు వచ్చారు.

సామాజిక మరియు ముద్రణ మీడియా కూడా డాక్టర్ సాహిబ్ బలిదానాన్ని కవర్ చేసింది. ఒక అసిస్టెంట్ కమిషనర్ ఒక పోస్ట్ రాశారు – వారు చేయగలిగేది ఇంతే, వారు నిజమైన చర్య తీసుకోలేకపోతున్నారు, ఎందుకంటే వారికి మతాధికారులను ఎదిరించడానికి లేదా వారికి వ్యతిరేకంగా ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి ధైర్యం లేదు – అయినప్పటికీ, ఈ చర్య కూడా కొంత ధైర్యాన్ని ప్రతిబింబిస్తుంది – ఒక మహిళగా ఆమె తన పోస్ట్‌లో ఇలా రాసింది: "షేక్ మహమూద్ పేదలకు రక్షకుడు కంటే తక్కువ కాదు. అతను ఒక అసాధారణ వైద్య నిపుణుడు. కొన్నిసార్లు, అతను పేదలకు ఉచితంగా ఖరీదైన రోగనిర్ధారణ పరీక్షలను కూడా అందించాడు. డాక్టర్ సాహిబ్ సంరక్షణ నుండి ప్రయోజనం పొందని ఒక్క కుటుంబం కూడా జిల్లాలో ఉండకపోవచ్చు."ఆమె జమాత్ సభ్యురాలు కాదు, కానీ ఆయన తరచుగా రోగులకు ఉచితంగా చికిత్స చేస్తారని, ఇది తన దృష్టిలో గొప్ప చర్య అని చెబుతూ ఆయనను ప్రశంసించారు. ఆమె ఇలా అన్నారు, "నేను డాక్టర్‌ని కాబట్టి పూర్తి అవగాహనతో ఇలా చెబుతున్నాను. డాక్టర్ సాహిబ్ విదేశాలకు, ఏ దేశానికైనా వెళ్లి, విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ, చాలా సంపదను సంపాదించి ఉండేవాడు. కానీ ఆయన సర్గోధలో ఉండి మానవాళికి సేవ చేయడానికి తనను తాను అంకితం చేసుకోవాలని ఎంచుకున్నారు." ఆమె ఇంకా ఇలా తెల్పింది. "ఈ రోజు, మొదటిసారిగా, నేను వ్యక్తిగత సంబంధం లేని వ్యక్తి మరణించినందుకు నేను ఏడ్చాను, అది మానవత్వం యొక్క బంధం మాత్రమే. ఈ పెద్దమనిషి దేవుని సేవకులకు అపారమైన అనుగ్రహాలను ప్రసాదించాడు. ఆయన చేసిన నేరం ఏమిటని ఎవరైనా అడిగితే, ఆయన చేసిన ఏకైక నేరం ఆయన అహ్మదీ కావడం మాత్రమే."

మరో వైద్యుడు ఇలా వ్రాశాడు: "సర్గోధాలో ఈఆర్‌సిపి చేసిన మొదటి వైద్య నిపుణుడు డాక్టర్ సాహిబ్. ఆయన అసాధారణ సామర్థ్యం మరియు సీనియారిటీ ఉన్నప్పటికీ, నేటికీ, ఆయన సర్గోధాలో అతి తక్కువ రేటుతో సేవలు నిర్వహించారు. ఆయన విశ్వాసం కారణంగానే హత్యకు గురయ్యారు. ఈ దేశంలో ఏదైనా చట్టం మిగిలి ఉందా?"

ఒక ప్రైవేట్ టెలివిజన్ ఛానెల్‌కు చెందిన ఒక జర్నలిస్ట్ మరియు యాంకర్ ఇలా రాశారు: "ఈ అనాగరికమైన మరియు పూర్తిగా విషాదకరమైన చర్యను ఖండించడానికి నాకు మాటలు రావడం లేవు. ఇది వ్యక్తపరచలేనిది."

మరొక జర్నలిస్ట్ ఇలా వ్యాఖ్యానించారు: "ఇది చాలా కాలంగా కొనసాగుతోంది. పాకిస్తాన్‌ను కాపాడటానికి, తీవ్రవాద గ్రూపులు మరియు సంస్థలను ఆపాలి. ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించే మరియు అహ్మదీలను లక్ష్యంగా చేసుకునే ఇటువంటి కార్యకలాపాలను మనం అంతం చేయాలంటే ఈ తీవ్రవాద సంస్థలను నిషేధించడం అత్యవసరం."

ఈ విశ్వాస సంరక్షకుల పట్ల ఎంత భయం ఉందంటే, ప్రభుత్వం, చట్ట అమలు సంస్థలు మరియు కోర్టులు కూడా వారి ముందు శక్తిహీనులుగా ఉన్నాయి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిని శిక్షించే మార్గాలను త్వరగా తీసుకురాగలగాలి. దేశం రక్షించబడాలంటే ఇప్పుడు వారిని పూర్తిగా నిర్మూలించడం అవసరం, ఎందుకంటే మతం పేరుతో తీవ్రవాదాన్ని కొనసాగిస్తున్న ఈ మతస్థులు దేశాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వారు తమను వ్యతిరేకించే ఎవరిపైనా అయినా దాడి చేస్తారు. ఏదేమైనా, మా ప్రార్థనలు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు మాత్రమే ఉన్నాయి మరియు మనం దీనికి న్యాయం చేయాలి. అల్లాహ్ అమరవీరుడి స్థాయిని పెంచుగాక!. మరియు అతని ప్రియమైనవారికి సహనం మరియు దృఢత్వాన్ని ప్రసాదించుగాక!. అతను తన వృద్ధ తల్లిని విడిచిపెట్టాడు. అల్లాహ్ ఆమె దుఃఖాన్ని తగ్గించుగాక!. అల్లాహ్ అతని భార్య మరియు పిల్లలను తన రక్షణ మరియు భద్రతలో ఉంచుగాక!.

---

**(12వ పేజి తరువాత)** అందుకు కారణం ఆ ఇంజీల్‌లో పేర్కొనబడినటువంటి ఆ దుఆ యొక్క తదుపరి వాక్యములే. ఆ వాక్యములేమనగా ఇప్పటి వరకు ఈ భువిపై దేవుని రాజ్యం స్థాపించబడలేదు. రాజ్యం స్థాపించబడ నందున, ఇతర కారణాల వలన ఆకాశంపై దేవుని ఆకాంక్ష నెరవేరినట్లు భూమండలంపై నెరవేరలేదు. కాని అందుకు పూర్తి భిన్నముగా ఖుర్ఆన్ బోధనలు గలవు. అనగా ఖుర్ఆన్ ఎంతో స్పష్టముగా ఇట్లు ప్రకటన చేస్తుంది. ఆకాశము నుండి స్వయం ప్రతిపత్తి అనుగ్రహించబడినదే ఏ దొంగ, హంతకుడు, వ్యభిచారుడు, అవిశ్వాసుడు, మోసగాడు, దుర్మార్గుడు మరేదేని పాపపు పనులు చేయువారు ఈ భూమండలంలో ఏ పనిని చేయలేరు. అలాంటప్పుడు ఆకాశాధికారం భూమండలంపై లేదని ఎలా చెప్పగలరు. దైవాదేశములను కొనసాగకుండా అడ్డుకొను మరేవైన ఇతర శక్తులు ఈ భూమండలంపై ఉన్నాయా?. అల్లాహ్ పవిత్రుడు. అలాంటి శక్తులేమి లేవు. కాని అల్లాహ్ తాలాయే స్వయముగా దేవదూతల కొరకు ఆకాశంపై వేరొక వ్యవస్థను నిర్ణయించాడు. మానవుల కొరకు భూమండలంపై మరొక వ్యవస్థను ఏర్పాటు చేశాడు. అల్లాహ్ తాలా తన ఆకాశాధికారంలో దేవదూతలకు ఎలాంటి స్వయం ప్రతిపత్తిని కల్పించలేదు. వారి స్వభావంలోనే విధేయత లక్షణాన్ని చేకూర్చాడు. వారు వ్యతిరేకించలేరు. మరుపు, బలహీనతలు వంటి ఏ లోపాలు వారిని ప్రభావితం చేయలేవు. కాని మానవుని స్వభావానికి మాత్రం స్వీకరించు, తిరస్కరించు గుణాన్ని ఆపాదించాడు. ఈ స్వయం ప్రతిపత్తి పైనుండి కల్పించబడినంత మాత్రమున దుష్టమానవుని స్థిరత్వం వలన భూమండలం నుండి దేవుని రాజ్యం కనుమరుగైనదని చెప్పలేము. పైగా వివిధ విధానాలలో దేవుని రాజ్యమే నెలకొంటూ ఉంటుంది. కాని ధర్మబద్ధతలు మాత్రం రెండు విధాలుగా గలవు. ఒకటి ఆకాశ దేవదూతల కొరకు ఏర్పాటు చేయబడిన విధి ధర్మం. అనగా వారు ఎన్నడు చెడు తలపెట్టరు. మరొకటి భూమండలంపై గల మానవుని కొరకు దేవుని విధి ధర్మం. పైగా వారికి చెడును ఎంచుకొను అభీష్టమును కూడ ఆకాశం నుండి కల్పించడం జరిగింది. **(నూహ్ నావా)**

**నూరుల్ ఇస్లాం శాఖ:**


**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి రచన:

బహిరంగముగా మేము బైఅత్ (ప్రమాణము) చేసినామని మీరు భావించకుము. బహిరంగానికి ఏ మాత్రం ప్రాధాన్యతలేదు. అల్లాహ్ మీ మనోభావాలను ఎరుగును. అందుకు అనుగుణముగానే మీతో వ్యవహరించును. శ్రద్ధ వహించుడు. ఈ సత్యమును మీకు తెల్పి నేను సందేశ చేరివేత బాధ్యత నుండి విముక్తుడ నగుచున్నాను. పాపమొక పాషాణము, దానికి అలవాటు పడకుము. ఈశ్వర కృతఘ్నుత ఒక దుర్మరణం. దాని నుండి రక్షింపబడుము. వీంకం బలము చేకూరుటకు ప్రార్థించుము. కొన్ని అపవాద వాగ్దానాలను గూర్చి గాకుండా ప్రార్థించునప్పుడు సర్వాధికారములు అల్లాహ్‌కేనని భావించని వాడు నా వర్గములోని వాడు కాదు. బూటకాలను, కపట మోసాలను వీడనివాడు నా వర్గములోని వాడు కాడు, ప్రపంచ భోగభాగ్యాల యందు మునిగి పరలోకమును పూర్తిగా విస్మరించినవాడు నా వర్గములోని వాడు కాడు. ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నివ్వనివాడు నా వర్గములోని వాడు కాదు. మధ్యపానము, జూదము, కామము, లంచము మొదలగు వ్యసనాలన్నింటి నుండి ప్రాయశ్చిత్తం చేయనివాడు నా వర్గములోని వాడు కాడు, ఐదు పర్యాయముల ప్రార్థనలను నియమ నిబంధనల ప్రకారము సలుపనివాడు నా వర్గములోని వాడు కాడు. ప్రార్థనలు చేయనివాడు వినయ విధేయతలతో అల్లాహ్‌ను ధ్యానించనివాడు నా వర్గములోని వాడు కాడు. తమపై చెడు ప్రభావంను దాల్చు చెడు మిత్రులను విడని వాడు నా వర్గములోని వాడు కాడు. తమ తల్లిదండ్రులను గౌరవించనివాడు, పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలకు విరుద్ధము కాని, నిషేదింపబడని వారి సూచనలను, మాటలను విననివాడు, వారు జీవించు వరకు వారి సేవ చేయనివాడు నావర్గములోనివాడు కాడు. తన భార్యతో, ఆమే బంధు మిత్రువులతో ఆప్యాయత, అనురాగాలతో వ్యవహరించని వాడు నా వర్గములోని వాడు కాడు. తమ ఇరుగు పొరుగు వారిని చిన్నచిన్న ఆనందాల నుండి దూరం చేయువాడు నా వర్గములోని వాడు కాడు. కపటము నుపయోగించి నిందితుని క్షమించగోరని వాడు నా వర్గములోని వాడు కాడు. భార్యను మోసం చేయు భర్త, భర్తను మోసంచేయు భార్య నా వర్గములోని వారు కారు. బైఅత్ సందర్భమున చేసిన వాగ్ధానమును ఏ విధముగానైన ఉల్లంఘించిన వాడు నా వర్గములోని వాడు కాడు. నన్ను మసీహ్ మౌవూద్, మహ్దీ మౌవూద్‌గా నమ్మని వాడు నా వర్గములోని వాడు కాడు. ధర్మబద్ధమైన అంశాలలో నన్నునుసరించని వాడు నా వర్గములోని వాడు కాడు. వ్యతిరేక వర్గీయుల సమావేశాలలో కూర్చొని వారి మాటలు విని తలలూపు వాడు నా వర్గములోని వాడు కాడు. పతితుడు, అబద్దమాడు వాడు, త్రాగుబోతు, దొంగ, జూదరి, హంతకుడు, నమ్మకద్రోహి, లంచగొండి, అన్యాయుడు, మోసగాడు, వారి సహచరుడు, తన సోదర, సోదరీమణులను అపనిందలకు గురి చేయువాడు, తమ దుష్కార్యములపై పశ్చత్తాప పడనివాడు, చెడు సహవాసములను వీడని వాడు నా వర్గములోని వాడు కాడు. ఇవన్నియు విషపూరితములు. వీటిని మ్రింగి మీరెలాగు బ్రతకలేరు. కాంతులు, అంధాకారములు ఒక చోట ఉండ లేవు. సహృదయులకు లభించు శుభములు అల్లాహ్‌తో కపటమాడు వాడు సమస్యలను సృష్టించువాడు పొందలేడు. తమ హృదయాలను పరిశుద్ధపర్చుకొను వారు ఎంతటి అదృష్టవంతులు. వారు తమ హృదయాలను అన్ని రకాల మలినాల నుండి శుభ్రం చేసుకొందురు. తమ దైవం ముందు వినమ్రతతో కూడిన ప్రతిజ్ఞను చేయుదురు. ఎందుకనగా వారు ఎన్నటికి వృధా చేయబడరు. అల్లాహ్ కూడ వారిని ఎన్నడు అప్రతిష్టపాలు చేయడు. ఎందుకనగా వారు అల్లాహ్ దాసులు. అల్లాహ్ వారి ప్రభువు. వారు అన్ని రకాల ఆపదల నుండి కాపాడబడుదురు. వారిని అంతమొందించాలని ప్రయత్నించు శత్రువు మూర్ఖుడు. ఎందుకనగా వారు అల్లాహ్ సన్నిధిలో నున్నవారు. అల్లాహ్ వారి సహాయకుడు. అల్లాహ్‌ను ఎవరు విశ్వసించెదరు?. అట్టివారే అల్లాహ్‌ను విశ్వసించేదరు. అదే విధముగా ఒక మోసగాడిని, కపటుడిని, జిత్తులమారిని గురించి చింతించువాడు కూడ అవివేకుడు. ఎందుకనగా వాడు స్వయముగా నాశనమగును. భూమ్యాకాశములను సృష్టించినప్పటి నుండి అల్లాహ్ సజ్జనులను, పుణ్యాత్ములను నాశనము చేయుట ఎన్నడు జరుగలేదు. వారి కొరకు అతడు గొప్ప గొప్ప కార్యములు చేసి చూపెను. నేడు కూడ చేసి చూపును. అల్లాహ్ గొప్ప విశ్వాస పాత్రుడు. విశ్వాస పాత్రుల కొరకు అతడు అద్భుత కార్యములొనరించును. ప్రపంచము వారిని కబళించగోరును. శత్రువులు వారిని కోపగించుకొందురు. కాని వారి మిత్రుడు వారిని ప్రతి సంహారక కార్యము నుండి రక్షించును. అన్ని రంగాలలో వారికి జయమును ప్రసాదించును. అతని సాన్నిహిత్యంను వీడని వాడు ఎంతటి పుణ్యాత్ముడు. అదృష్టవంతుడు. మేము అతనిని విశ్వసించితిమి. మేము అతనిని గుర్తించితిమి. సర్వ ప్రపంచమునకు అతడే సర్వాధికారి. అతడే నాపై సువార్త వాణిని అవతరింపజేసెను. అతడే నా కొరకు గొప్ప సంకేతములను చూపెను. అతడే నన్ను ఈ కాలమునకు మసీహ్ మౌవూద్‌గా అవతరింప జేసెను. అతడు తప్ప మరో దైవం ఆకాశము నందు గాని, భూమి యందు గాని లేడు. అతనిని విశ్వసించని వాడు శుభములకు దూరమై ఆపదలలో చిక్కుకొని పోవును. మేము మా దేవుని ప్రకాశవంతమైన సువార్త వాణిని పొందితిమి. ప్రపంచ దేవుడతడేనని మేము గుర్తించితిమి, చూచితిమి. అతడు తప్ప మరొక దైవం లేదు. మేము గుర్తించిన అల్లాహ్ ఎంతో శక్తి మంతుడు. చిరకాలుడు, సర్వాధికారములు గలవాడు. అతని గ్రంథము, వాగ్దానమునకు విరుద్ధముగా వున్నవి తప్ప అతనికి అసాధ్యమైనదేమియును లేదు. కనుక తానూహించి సృష్టించిన శాసనాలనవలంభించు ప్రకృతి ప్రియుల వలే మీరు ప్రార్థించకుము. వాటిని అల్లాహ్ గ్రంథము ధృవీకరించ లేదు. వారు ధిక్కరించబడిన వారు. వారి ప్రార్థనలు ఎన్నడూ స్వీకరించబడవు. వారు అంధులు, దృశ్య శక్తిని కోల్పోయిన వారు, వారు మృతులు, సజీవులు కారు. దేవుని ముందు తాము ఏర్పర్చుకున్న సిద్ధాంతాలను ప్రవేశపెట్టెదరు. మరియు అతని అసాధారణమైన శక్తులకు హద్దులు నిర్దేశిస్తారు. అతనిని బలహీనుడిగా భావిస్తుంటారు. కావున వారి స్థితిగతుల ప్రకారము వారితో వ్యవహరించబడును. కాని నీ అల్లాహ్ సర్వ శక్తిమంతుడని విశ్వసించి నీవు ప్రార్థించినప్పుడే నీ ప్రార్థన స్వీకరించబడును. మేము చూసిన అద్భుతాలను నీవు చూడగలవు. మా సాక్ష్యము అనుభవ పూరితము. కట్టుకథ కానేకాదు. అల్లాహ్‌ను సర్వశక్తిమంతుడని భావించని వాడు, అతని దృష్టిలో ప్రకృతి సిద్ధాంతాలను వ్యతిరేకించువాడు ఆపదలలో చిక్కుకొనినప్పుడు అతనికి దుఆ చేయాలనే ఆలోచన కలుగడం చోద్యము కాదా?, అట్టి వ్యక్తి దుఆ స్వీకరించబడునా?. కావున ఓ సజ్జనుడా! నీ వట్లు చేయకుము. లెక్కించలేనన్ని నక్షత్రములను స్థంభము లేకుండా వ్రేలాడగట్టిన వాడు, భూమ్యాకాశములను శూన్యము నుండి పుట్టించినవాడే నీ అల్లాహ్. నీ కార్యమెనర్చుట అతనికి సాధ్యము కాదని నీవు ఊహింతువా? నీ ఊహయే నిన్ను నష్టపర్చును. మన అల్లాహ్‌లో అనన్య అద్భుతాలు గలవు. కాని అతనిని నమ్మి, అతనికి విశ్వాస పాత్రులైన వారే వాటిని చూడగలరు. అతడు శక్తిమంతుడని నమ్మని వారికి, విశ్వాసపాత్రులు కాని వారికి, అతనితో సంబంధము ఏర్పర్చుకొనని వారికి అతడు అద్భుతాలు, మహిమలు చూపడు. సర్వాధికారుడు, శక్తి మంతుడైన ఒక దైవమున్నదని తెలియని వాడు ఎంతో దురదృష్టవంతుడు. మన అల్లాహ్‌యే మన స్వర్గము . మన సర్వానందములు మన అల్లాహ్ యందే గలవు. ఎందుకనగా మేమతనిని తిలకించితిమి. అందములన్నియు అతనిలో పొందితిమి. ఈ సంపత్తిని ప్రాణాలర్పించైన కొనుగోలు చేయవచ్చును. సర్వస్వము ధారపోసైన ఈ ముత్యమును కొనవచ్చును. ఓ దురదృష్టవంతులారా! ఈ చెలిమ వైపు పరుగెత్తుము, ఇదియే మీ దాహము తీర్చును. ఇది జీవనమిచ్చు చెలిమ, ఇదియే మిమ్ము రక్షించును. నేనే మి చేయవలయును?, ఈ శుభవార్తను ప్రజల హృదయాలలో నాటుటకు నేను ఏ విధానమును ఎంచుకోవలెను?. ఇతడే మీ అల్లాహ్! అని ప్రజలు ఆలకించుటకు, తెలుసుకొనుటకు నేను ఏ విధముగా చాటింపవలెను?. ప్రజలు ఆసక్తితో వినుటకు నేను వారి చెవులకు ఏ విధమైన చికిత్స చేయవలెను?.





ఒకవేళ మీరు అల్లాహ్‌కు అంకితమైనచో నిశ్చయముగా అల్లాహ్ కూడ మీవాడగునని భావించుము. మీరు నిద్రించినను అతడు మీ కొరకు జాగరణ చేయును. శత్రువులను మీరెరుగరు, కాని అతడెరుగును. వారి యుక్తులను భంగ పరుచును. మీ అల్లాహ్ యందు ఏ ఏ మహిమలు గలవో మీరింత వరకు ఎరుగరు. ఒకవేళ మీరు తెలుసుకున్నచో ప్రపంచము కొరకు మీరు ఏ రోజు దు:ఖించరు. ఒక నిధి గల సంపన్నుడు ఒక పైసా పోయినచో ఏడ్చునా? విలపించునా? వినాశనమగునా?. అవసరములన్నింటిని అల్లాహ్‌యే తీర్చునని, అతడే ఒక గొప్ప నిధియని మీరేరిగినచో ప్రపంచ సంపదల కొరకు మీరిట్లు పరుగిడుదురా?. అల్లాహ్ ఒక ప్రియమైన నిధి. అడుగడున మీకతడు సహాయపడును. అతడు లేనిది మీరు లేరు, మీ ఆస్తి పాస్తులు, మీ ఉపాయయుక్తులు అన్ని వ్యర్థములే. కనుక అతనిని గుర్తించుము, ఆదరించుము. ఇతర జాతుల వారి ననుసరించకుము. వారు పూర్తిగా సాధనాలపై ఆధారపడి యున్నారు. సర్పము మట్టి తిన్నట్లుగా వారు కూడ ప్రాపంచికమనే మట్టిని తిన్నారు. అంతేగాకా రాబంధువులు, కుక్కలు చచ్చిన మాంసంను తిన్నట్లుగా వారు కూడ మృత మాంసంను తినుటకు అలవాటు పడిపోయారు. వారు అల్లాహ్‌కు చాలా దూరమైపోయారు. మానవులను పూజించిరి, పంది మాంసంను ఆరగించిరి. మద్యపానంను నీటి వలె సేవించిరి. పరిధులు దాటి ప్రాపంచిక పరికరాలపై ఆధారపడినందున, దేవుని నుండి శక్తులను వేడుకోనందున వారు మృత్యువాత పడిరి. పంజరం నుండి ఎగిరిపోయిన పావురము వలే వారిలో నుండి ఆత్మలు వెళ్ళిపోయినవి. వారిలో ప్రాపంచిక వ్యామోహము బలపడినది. ఆ వ్యామోహము వారి అంతరంగమును పూర్తిగా నాశనము చేసినది. కనుక మీరు ఆ రుగ్మతలకు భయపడుము. అవసర నిమిత్తము ప్రాపంచిక సాధనాలను ఉపయోగించుటను నేను తప్పు పట్టడం లేదు. కాని మీరు ఇతర జాతుల వలే ప్రాపంచిక వ్యామోహములో పూర్తిగా మునిగిపోవుటను మరియు పరికరాలను సృష్టించిన అల్లాహ్‌ను విస్మరించుటను తప్పుబట్టుచున్నాను. ఒకవేళ మీకు కన్నులున్నచో సర్వమండలమంతయు మీకు అల్లాహ్‌యే కనిపించును. ఇతరములన్ని అశాశ్వితములు. అతడు కోరనిచో మీరు మీ చేతులను దగ్గరకు గాని, దూరము గాని చేయలేరు. ఒక నిర్జీవుడు ఈ విషయముపై పరిహసించును. ఒకవేళ అతడు మరణించినచో అతని మరణం అతనికి అతని పరిహాసముకన్న ఎంతో ఉత్తమమగును. జాగ్రత్తా! ఇతర జాతుల వారిని చూచి మీరు వారితో పోటి పడకుము. వారు ప్రపంచ పథకాల యందు చాలా ప్రగతిని పొందినారని భావించి మనము కూడ వారినే అనుసరించెదమని వారి అడుగుజాడలో నడుచుటకు ప్రయత్నించకుము. వినుము! మిమ్ము తనవైపు ఆహ్వానించు అల్లాహ్ పట్ల వారు ఎమరుపాటుగా, అజ్ఞానముగా ఉన్నారని అర్థము చేసుకొనుము. వారి దేవుడెవరు?. కేవలం ఒక మానవ మాత్రుడు మాత్రమే. అందుకే వారు విస్మరించబడిరి. ప్రపంచ కార్యకలాపాల నుండి, ఆర్జితాల నుండి నేను మిమ్ములను అడ్డుకోవడం లేదు. కాని ప్రపంచమునే సర్వస్వమని భావించు వారిని మీరు అనుసరించకుము. మీరు తలపెట్టు కార్యము ప్రాపంచికమునదైనను, ధార్మికమునదైనను శక్తి, సామార్థ్యములను అనుగ్రహించమని అల్లాహ్‌ను యాచించు పరంపరను కొనసాగించవలెను. కేవలం నోటితో పదాలను ఉచ్చరించకుండా శుభములన్నియు ఆకాశము నుండే చేకూరునను గట్టి నమ్మకమును కలిగియుండవలెను. నీవు చేయనారంభించు ప్రతి కార్యమునకు, ప్రతి కష్టనివారణకు ముందు ఎలాంటి యుక్తులు చేయకుండా ద్వారములను మూసివేసి దేవుని ఆస్థానములో మోకరిల్లి నాకు ఈ సమస్య ఎదురైనది, నీ అనుగ్రహముతో ఈ సమస్యకు పరిష్కారము చూపమని వేడుకున్నచో అప్పుడు పరిశుద్ధ ఆత్మ నీకు సహాయమును అందించును. మీ ఊహకందని మార్గములను అతడు మీపై తెరుచును. అప్పుడు నీవు సన్మార్గుడవని లిఖించబడును. మీ ప్రాణాలపై మీరు కనికరించుకొనుము. అల్లాహ్ తాలాతో పూర్తిగా అనుబంధమును తెంచుకొని, ఎల్లప్పుడు పరికరాలనే సర్వస్వమని నమ్ముకొని, చివరికి శక్తిని ప్రసాదించమని అల్లాహ్‌ను అడుగుటకు నోటితో ఇన్షా అల్లాహ్ అని పలుకని వారిని అనుసరించకుము. మీ యుక్తులన్నింటికి అల్లాహ్‌యే మూలమని గ్రహించుటకు అల్లాహ్ తాలా మీ కన్నులను తెరుచుగాకా!. ఒకవేళ దూలము పడిపోయినచో వాసములు ఇంటి కప్పును ఆపగలవా?. అలా ఎన్నడు జరుగదు. ఒక్కసారిగా కుప్పగా కూలిపోవును. అలాంటి సమయంలో ఎన్నో ప్రాణాలు పోవుటకు అవకాశముండును. ఆ విధముగానే అల్లాహ్ సహాయ సహకారములు లేనిదే మీ యుక్తులు పనిచేయవు. ఒకవేళ మీరతనిని సహాయమును ఆర్జించనిచో, శక్తి ప్రసాదించమని అతనిని వేడుకొనుటను అలవర్చుకొననిచో మీకు ఎలాంటి సాఫల్యము లభించదు. చివరికి ఎంతో విచారముతో మరణించెదరు. వాస్తవానికి మీ సంపూర్ణమైన, శక్తి మంతుడైన అల్లాహ్‌ను ఇతర జాతులు గుర్తించకున్నను అవి ఎందుకు అభివృద్ధి చెందుచున్నాయని మీరు ఆలోచించకుము. ఇందుకు సమాధానం ఏమనగా, ఆ జాతులు అల్లాహ్‌కు దూరమైనందులకు ప్రాపంచిక పరీక్షలను ఎదురు కొనుచున్నవి. కొన్ని సార్లు అల్లాహ్ ఈ విధముగా కూడ పరీక్షిస్తాడు. అనగా ఎవరైతే అల్లాహ్‌ను వీడి, ప్రాపంచిక భోగాభాగ్యాలపై ఆకాంక్షను పెంచుకొని, ప్రాపంచిక ఐశ్వర్యాలను ఆశించెదరో అట్టి వారి కొరకు ప్రాపంచిక ద్వారములు తెరువబడుతాయి. కాని ధార్మిక పరంగా అట్టి వ్యక్తులు దిగంబరులుగా, నిరాధారులుగా మిగిలి పోతారు. చివరికి ప్రాపంచిక కోరికలతోనే మరణిస్తారు. అలా వారు ఒక శాశ్వత నరకంలో పడవేయబడుదురు. మరి కొన్ని సందర్భాలలో అస్వార్ధక స్థితిలోనే ఉంచబడి పరీక్షించబడుదురు. కాని ఈ చివరి పరీక్ష మొదట పరీక్షవలే భయంకరముగా ఉండదు. ఎందుకనగా మొదట పరీక్షించబడు వారు గర్వితులై ఉందురు. మొత్తానికి ఈ ఇరు వర్గీయులు మఘ్‌జూబి అలైహిం (దైవాగ్రోషమునకు గురైనవారి) పరిధిలోకే వస్తారు. సత్యానందమునకు మూలాధారము అల్లాహ్‌యే. అట్టి జీవాత్ముడు, శాశ్వితుడైన దైవం పట్ల ప్రజలు ఎమరుపాటుగా ఉన్నారు. ఒక రకముగా పూర్తి అజ్ఞానములో ఉన్నారు. అతని నుండి ముఖములు త్రిప్పుకొని ఉన్నారు. అలాంటప్పుడు వారికి స్వచ్ఛమైన ఆనందము ఎక్కడి నుండి లభించును. ఈ రహస్యమెరిగిన వారు ధన్యులు. ఈ రహస్యమెరుగని వాడు నాశనమొందును. అదే విధముగా మీరు తత్వజ్ఞానులను అనుసరించకుడు. వారిని గౌరవ దృష్టితో చూడకుము. వారివన్నియు అవివేక కార్యములు. అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్ నందు మీకు చూపినదే సత్యతత్వజ్ఞానము. ఈ ప్రాపంచిక తత్వమును ప్రేమించువారు నాశనమగుదురు. స్వచ్ఛమైన జ్ఞానమును, వేదాంతాలను అల్లాహ్ తాలా గ్రంథములో అన్వేషించిన వారే సఫలీకృతులగుదురు. అవివేక మార్గాలను ఎందుకు అనుసరిస్తున్నారు?. అల్లాహ్‌కు తెలియదని మీరతనికి విషయములు నేర్పుదురా?. మీకు సన్మార్గమును చూపెదరని భావించి అంధుల వెనుక పరుగెత్తుదురా?. ఓ అవివేకులారా! వారే స్వయముగా అంధులైనచో మీకు వారెలా సన్మార్గమును చూపెదరు. మీతో వాగ్దానం చేయబడిన స్వచ్ఛమైన వేదాంతము పరిశుద్ధ ఆత్మ ద్వారా లభించును. ఇతరులకు అవగాహన లేని పవిత్రమైన బోధనల వరకు మీరు పరిశుద్ధ ఆత్మ ద్వార మాత్రమే చేరుకొందురు. ఒకవేళ స్వచ్ఛతతో కోరుకున్నచో చివరికి మీకది లభించును. అప్పుడు మనస్సుకు నూతనోత్తేజమును, ఒక నూతన జీవితమును ప్రసాదించునవి మరియు నమ్మకమనే ఉన్నత శిఖరము వరకు చేర్చునవి ఈ బోధనలేనని మీరు అర్థం చేసుకుందురు. చచ్చిన మాంసమును తినువాడు మీకెలా పరిశుభ్రమైన ధర్మబద్ధమైన అహారమును తెచ్చును?. వారు స్వయముగా అంధులైనప్పుడు మీకెలా మార్గమును చూపెదరు?. పవిత్ర వివేకములన్నియు ఆకాశము నుండే వచ్చును. అలాంటప్పుడు నీవు ప్రాపంచికుల వద్ద ఏమి వెతుకుచున్నావు. ఎవరి ఆత్మలు ఆకాశము వైపునకు వెళ్ళునో వారే వివేకములకు అర్హులగుదురు. స్వతాహా తృప్తి చెందని వారు మిమ్ములనేలా తృప్తి పర్చెదరు. అందుకు ముందుగా స్వచ్ఛత మరియు హృదయ శుద్ధి తప్పనిసరిగా అలవర్చుకోవలెను. ఆ తరువాతయే ఇవన్నియు మీకు లభించును. గతంలో దేవుని సువార్త వాణి అవతరించేది. ఇప్పుడు అవతరించడం లేదని, పరిశుద్ధ ఆత్మ పూర్వ కాలములోనే అవతరించినది, నేటి కాలంలో అవతరించడం లేదని మీరు

**అహ్‌దీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **“ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.”** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

**దుఆ ఆశించువారు:** ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**అహ్‌దీస్ బోధనలు**

**“ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను.” అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

**దుఆ ఆశించువారు:** ***Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

భావించకుడు. నేను మీకు తెల్పు సత్యమేమనగా అన్ని ద్వారములు మూయబడినను పరిశుద్ధ ఆత్మ అవతరించు ద్వారము మాత్రము ఎన్నటికి మూయబడదు. మీరు మీ హృదయపు ద్వారములు తెరచి ఉంచుము. ఫలితముగా ఆ పరిశుద్ధ ఆత్మ అందులోకి ప్రవేశించును. పైగా మీరు స్వయముగా సూర్యునితో దూరముగా ఉంటూ దాని కిరణములు చొరబడు కిటికిని మూసుకొనుచున్నారు. ఓ మూర్ఖులారా! లెమ్ము! ఆ కిటికిని తెరువుము. అప్పుడే ఆ సూర్యకిరణాలు మీలోకి ప్రవేశించును. నేటి కాలములో అల్లాహ్ తాలా ప్రాపంచిక అనుగ్రహపు మార్గములను మూసి వేయకుండా మీ కోసం అధిక మార్గములను తెరచినాడు. అలాంటిది నేడు మీకు అత్యవసరమున్న ఆకాశపు శుభముల మార్గములను అతడు మూసివేసినాడని మీరు భావించుచున్నారా?. అలా ఎన్నడు జరుగదు. పైగా ఎంతో స్పష్టముగా ఆ ద్వారములు తెరువబడ్డాయి. ఫాతిహా ఆధ్యాయములో అల్లాహ్ తాలా మీకు నేర్పిన బోధనల ప్రకారము గత అనుగ్రహపు ద్వారములన్నింటిని అతడు మీ కొరకు తెరచినాడు. అలాంటప్పుడు వాటిని స్వీకరించుటకు మీరు ఎందుకు నిరాకరిస్తున్నారు. స్వయముగా మీ వరకు చేరు చెలిమను మీరు కోరుకొనుము. పాల కొరకు తల్లడిల్లు పాప వలే మీరు కూడ విలపించుము. అప్పుడే పాలు చనుపాల వలే దొర్లును. అనుగ్రహ అర్హులుగా మారినప్పుడే మీరు అనుగ్రహింప బడుదురు. ఆవేదనతో విలపించుము, ఫలితముగా సంతృప్తి పొందెదరు. నిరంతరము విలపించుము ఫలితముగా ఒక చెయ్యి మిమ్ములను పట్టుకొనును. అల్లాహ్ మార్గము ఎంతో కష్టతర మార్గము. కాని మరణించు సంకల్పముతో ఆ గుండంలోకి దిగిన వారికి, అగ్నియే ప్రియమైనదని తమ హృదయాలలో నిర్ణయించుకొను వారికి అది సులభతరమగును. వారు తమ దైవం కొరకు ఆ అగ్నిలో కాలిబూడిద అగుటకు సిద్ధపడుదురు. ఆపై వారు తమకు తామే ఆ అగ్నికి ఆహుతి చేసుకొందురు. చివరికి వారు దానిని ఒక స్వర్గముగా పొందెదరు. ఈ విషయమునే అల్లాహ్ తాలా ఈ విధముగా తెలిపెను. వ ఇన్ మిన్‌కుం ఇల్లా వారిదుహా కానా అలా రబ్బిక హత్‌మన్ మఖ్‌జియన్ (మరియమ్: 72) అనగా ఓ దుర్మార్గులారా! పవిత్రులారా! నరకపు అగ్ని నుండి ప్రయణించకుండా మీలో ఎవరు ఉండరు. కాని అల్లాహ్ కొరకు ఎవరైతే తమను అగ్నికి ఆహుతి చేసుకొందురో వారే ముక్తిని పొందెదరు. కాని ఎవరైతే తమ తుచ్ఛ కోరికల కోసం అగ్నిలో ప్రవేశించెదరో వారిని ఆ అగ్ని కాల్చి బూడిది చేయును. అల్లాహ్ కొరకు తమ తుచ్ఛ కోరికలతో పోరాడు వారు ధన్యులు. కాని తమ తుచ్ఛ కోరికల కోసం అల్లాహ్‌తో పోరాడు వారు, అతనికి అనుగుణముగా నడుచుకోని వారు అధములు. తన మనోవాంచల కొరకు దేవుని ఆదేశములను ప్రక్కకు పెట్టు ఏ వ్యక్తి కూడ ఆకాశము నందు ప్రవేశించలేడు. కావున పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఏ చుక్క, ఏ బిందువు కూడ మీకు వ్యతిరేకముగా సాక్ష్యమివ్వకుండా ఉండుటకు ప్రయత్నించుము. పొరపాటున వాటి వలన నీవు పట్టుబడకూడదు. ఎందుకనగా ఒక చిన్న తప్పు కూడ శిక్షకు అర్హులను చేయును. సమయం తక్కువగా ఉన్నది వయస్సుపై బడుతుంది. కావున వడివడిగా అడుగులు వేయుము. సాయంకాలం సమీపంలో ఉన్నది. సమర్పించు దానిని పదే పదే పరిశీలించుకొనుము. పొరపాటున కూడ ఏమి మిగిలిపోకుండా చూసుకొనుము. మాటల గారడి లేదా నిరుపయోగ, నిష్ప్రయోజమైనది, రాజ దర్బారులో సమర్పించుటకు అనర్హత గలది కాకుండా చూసుకొనుము.

మీలో కొందరు హదీసులను పూర్తిగా నమ్మరని నేను విన్నాను. ఒకవేళ అలా చేయుచున్నచో వారు పెద్ద తప్పిదము చేయుచున్న వారగుదురు. ఇలా చేయమని నేను మీకు సూచించడం లేదు. మీ మార్గదర్శనమునకై అల్లాహ్ మీకు మూడు వరములను ప్రసాదించినాడని నా విశ్వాసం. వాటిలో మొదటిది పవిత్ర ఖుర్‌ఆన్. ఇందులో అల్లాహ్ ఏకత్వం, అతని వైభవము, గొప్పదనమును గూర్చి చర్చించబడినది. యూదులు క్రైస్తవుల మధ్య గల భేదాభిప్రాయాల పరిష్కారము కూడ ఇందులో చూపబడింది. మరియమ్మ కుమారుడైనా ఏసు సిలువ ద్వారా మరణించబడ్డాడు. కావున అతడు శాపగ్రస్థుడు. ఇతర ప్రవక్తల వలే వారు ఉన్నత స్థాయిని పొందలేదనునది వారి తప్పిదములలో, భేదాభిప్రాయాలలో ఒకటి. అదే విధముగా పవిత్ర ఖుర్‌ఆన్‌లో నీవు అల్లాహ్‌ను కాకుండా మరెవ్వరిని ఆరాధించకుమని తెలుపబడింది. మానవులను గాని, జంతువులను గాని, సూర్య చంద్రులను గాని, నక్షత్రాలను గాని, మరే ఇతర మాధ్యమాలను గాని, మీ అంచంచల కోరికలు గల మనస్తత్వమును గాని. కావున మీరు జాగ్రతపడుడు. దేవుని బోధనలకు గాని, పవిత్ర ఖుర్‌ఆన్ మార్గదర్శనమునకు గాని విరుద్ధముగా ఒక్క అడుగైనా వేయకుము. ఎవడేని పవిత్ర ఖుర్‌ఆన్‌లోని 700 ఆదేశాలలో ఏ ఒక్క చిన్న ఆదేశమునైనా విడిచిపెట్టినచో వాడు విముక్తి ద్వారమును తన చేతులారా తనపై మూసుకొనువాడగునని నేను మీకు నిజముగా తెల్పుచున్నాను. స్వచ్ఛమైన, సంపూర్ణమైన మోక్ష మార్గములను పవిత్ర ఖుర్‌ఆన్ చూపినది. మిగిలినవన్నియు దాని ఛాయలే. కనుక మీరు ఖుర్‌ఆన్‌ను శ్రద్ధతో ఏకాగ్రతతో చదువుము. దానిని అమితముగా ప్రేమించుము. ఎంతగాననగా మీరు ఎవరిని ప్రేమించ నంతగా. ఎందుకనగా అల్లాహ్ తాలా నన్ను ఉద్దేశించి **అల్ ఖైరు కుల్లుహు ఫిల్ ఖుర్‌ఆన్** అనగా అన్ని రకాల శ్రేయస్సులు పవిత్ర ఖుర్‌ఆన్‌లో గలవని తెల్పినాడు. ఇదే సత్యము. ఇట్టి గ్రంథానికి కాకుండా మరొక దానికి ప్రాధాన్యత నిచ్చు వారిపై విచారము. మీ సాఫల్యతకు, మోక్షమునకు గల మూలాధారము పవిత్ర ఖుర్‌ఆన్‌లో గలదు. మీకు అవసరమున్న అన్ని ధార్మిక ఆవశ్యకతలు అందులో పొందుపర్చబడి ఉన్నవి. ప్రళయకాలమున మీ విశ్వాసమును ధృడపర్చునది, నిరాకరించునది కూడ పవిత్ర ఖుర్‌ఆన్‌యే. మీకు పరోక్షముగానైన మార్గదర్శనము చూపుటకు పవిత్ర ఖుర్‌ఆన్ తప్ప మరే ఇతర గ్రంథము ఆకాశము క్రింద లేదు. ఖుర్‌ఆన్ వంటి అద్భుత గ్రంథమును మీకు నొసంగి అల్లాహ్ మీకెంతో మేలు చేసినాడు. మీకు ఇవ్వబడిన గ్రంథము ఒకవేళ క్రైస్తవులకు ఇవ్వబడినచో వారు నాశనమయ్యేవారే కారని నేను మీకు సత్యాన్ని తెలుపుచున్నాను. యూదులకు తౌరాత్ బదులుగా మీకు ఇవ్వబడిన ఈ వరమును, మార్గదర్శకమును ప్రసాదించి ఉండినచో వారిలోని కొన్ని వర్గములు ప్రళయకాలమును నిరాకరించేవి కావు. కావున మీకు అనుగ్రహింపబడిన ఈ బహుమానమును గౌరవించుము. ఇది అపూర్వమైన బహుమానము, ఇదొక గొప్ప సంపత్తి. ఒకవేళ పవిత్ర ఖుర్‌ఆన్ అవతరించకపోయినచో ప్రపంచమంతయు ఒక కుళ్ళిన మాంసమువలే దుర్గంధముగా ఉండేది. పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథము ముందు ఇతర మార్గదర్శక సూత్రములన్నియు వ్యర్థమైనవే. ఇంజీల్‌ను తీసుకవచ్చిన పరిశుద్ధాత్మ ఒక పావుర రూపంలో అవతరించినది. అది బలహీనమైన, శక్తిహీనమైన ఒక పక్షి. దానిని పిల్లి కూడ పట్టుకోగలదు. అందుకోసమే క్రైస్తవులు రోజురోజుకు బలహీనతలకు లోనవుచున్నారు. వారిలో ఆధ్యాత్మికత కనుమరుగైనది. ఎందుకనగా వారి విశ్వాసపు సుస్థిరత కేవలం పావురముపైనే ఆధారపడి యుండెను. కాని పవిత్ర ఖుర్‌ఆన్‌ను తీసుకవచ్చిన పరిశుద్ధాత్మ మాత్రము భూమిపై నుండి ఆకాశము వరకు విస్తరించిన ఒక వైభవోపేతమైన రూపములో అవతరించి, తన ఉనికి స్వభావమును భూమ్యాకాశములలో నింపెను. కనుక ఆ పావురపు సామర్థ్యము ఎక్కడా? ఈ వైభవోపేతుని ప్రకాశములు ఎక్కడా?. ఈ ప్రస్తావన పవిత్ర ఖుర్‌ఆన్‌లో కూడ గలదు. ఒకవేళ ఆధ్యాయములు, అర్థముల నుండి దూరముండనిచో పవిత్ర ఖుర్‌ఆన్ మానవున్ని కేవలం ఏడు రోజులలోనే పరిశుద్ధిన్ని చేయగలదు. మీరు స్వయముగా ఖుర్‌ఆన్ నుండి దూరముగా పారిపోకున్నచో అది మిమ్ములను సందేశహరుల వలే తీర్చిదిద్ద గలదు. పవిత్ర ఖుర్‌ఆన్ కాకుండా మరే ఇతర గ్రంథము తనను పఠించువారి కొరకు ప్రారంభములోనే **ఎహ్‌దిన స్సిరాతల్ ముస్తకీమ సిరాతల్లజీన అన్ అమ్‌త అలైహిం** (ఫాతిహా: 6–7) అనే దుఆను నేర్పించి నమ్మకమును కల్పించింది. అనగా పూర్వీకులకు చూపిన నీ వరముల మార్గము మాకు చూపుము. ఆ వరములు ప్రవక్తృత్వం, సత్యవాదుత్వం, అమరత్వం, సంస్కర్తత్వం. అందుకే సహసించి ముందడుగు వేయుము మరియు పవిత్ర ఖుర్‌ఆన్ ఆహ్వానాన్ని తిరస్కరించకుము. మీ పూర్వీకులకు ఇచ్చిన వరములనే అతడు మీకు ఇవ్వదలిచాడు. ఇస్రాయీలీల రాజ్యం, ఇస్రాయీలీల పవిత్ర ఆరాధన

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు."** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



మందిరమును మీకు నోసంగలేదా?. అది నేటి వరకు మీ ఆధీనములోనే ఉన్నది. కావున ఓ బలహీన అభిమతం గలవారా!, ఓ సాహస హీనులారా! మీ దైవం ప్రాపంచికపరమైన ఇస్రాయీల రాజ్యంనకు మిమ్ములను ప్రతినిధులను చేసినను, ఆధ్యాత్మిక పరమైన రాజ్య పరంపరకు ప్రతినిధులను చేయలేదని మీరు భావిస్తున్నారా?. వాస్తవానికి అల్లాహ్ తాలా వారికన్న అధికముగా మిమ్ము అనుగ్రహించాలని నిశ్చయించుకున్నాడు. అల్లాహ్ తాలా వారి ఆధ్యాత్మిక, ప్రాపంచిక సిరి సంపదలకు మిమ్ములను వారసులను చేశాడు. కాని మీ సిరి సంపదలకు మాత్రం అల్లాహ్ తాలా మరెవరిని వారసులుగా చేయడు. ప్రళయకాలం వచ్చునంత వరకు అల్లాహ్ తాలా దైవ వాణుల, సువార్త వాణుల, సంభాషణల, సంబోధనల వరముల నుండి మిమ్ము ఏమాత్రం దూరం చేయడు. గతంలో పూర్వికులకు అనుగ్రహించిన వరములన్నింటిని అతడు మీకు తప్పకుండా అనుగ్రహించును. కాని ఏ వ్యక్తి అయితే దైవాన్ని కించపరుస్తూ తనపై దైవ వాణి అవతరించకున్నను అవతరించినదని, దేవుడు సంభాషణల ద్వారా, సంబోధనల ద్వారా అతనిని పలకరించకున్నను తనను పలుకరిస్తున్నాడని ప్రకటించుకొను వాడు మాత్రం నాశనమగునని నేను దేవున్ని అతని దూతలను సాక్షిగా నిలుపుతూ ప్రకటిస్తున్నాను. ఎందుకనగా అట్టివాడు తన సృష్టికర్తపై నింద మోపెను. అతనిని మోసగించెను. ఎంతో భయంకరమైన దురాశను, దుశ్చర్యను వ్యక్తపర్చెను. కావున మీరు అట్టి స్థితి నుండి భయపడుడు. స్వప్నాలను సృష్టించి వినిపించు అసత్యులను, సంభాషణల, సంబోధనల పరంపర తనపై కొనసాగుతుందని అసత్య ప్రకటనలు చేయువారిని అల్లాహ్ శపించుగాకా!. ఒక రకముగా వారు అసలు దేవుడే లేడని వారి హృదయాలలో భావించుకొంటారు. కాని దేవుని పాశాణము వారిని కఠినముగా శిక్షించును. వారి శిక్ష వారి నుండి దూరం కాజాలదు. కావున మీరు సత్యతలో, సన్మార్గములో, ధార్మికతలో, దైవాభిమానంలో స్వయముగా అభివృద్ధి చెందుము. జీవించినంత కాలము ఇదే మీ పనియని భావించుము. మరల మీలో ఎవరినైతే అల్లాహ్ ఇష్టపడునో వారికి తన సంభాషణల, సంబోధనల వరమును అనుగ్రహించును. కాని మీకు ఇలాంటి కోరిక ఉండకూడదు. మీ మనోవాంఛనల వలన పొరపాటున కూడ షైతాన్‌కు తన పరంపరను ప్రారంభించు అవకాశం లభించకూడదు. ఇలాంటి వాటి వలనే అనేకులు నాశనమైపోతారు. అందుకే మీరు సేవ, ఆరాధన కార్యక్రమాలలో నిమగ్నమై ఉండుము. దేవుని ఆదేశాలన్నింటిని పాటించాలనే కార్యక్రమములోనే మీ ప్రయత్నాలన్ని ఉండాలి. విశ్వాసంలో ప్రగతిని ఆశించుము. అది ముక్తి కోసమే గాని సువార్త వాణి కోసం కాకూడదు. పవిత్ర ఖుర్ఆన్ మీకు ఎన్నో పవిత్రమైన ఆదేశాలిచ్చింది. మీరు అన్యారాధన నుండి పూర్తిగా దూరముండాలనేది వాటిలో ఒక ఆదేశము. అన్యారాధుడు ముక్తిమార్గంను పొందలేడు. మీరు అబద్ధమాడకూడదు. ఎందుకనగా అబద్ధము కూడ అన్యారాధనయే అగును.

చెడుచూపుతో, వ్యామోహపు ఆలోచనలతో పరస్త్రీలను చూడకూడదని, అలా కాకుండా ఇతర దృష్టితో చూసినచో తప్పులేదని ఇంజీల్ బోధించినట్లుగా పవిత్ర ఖుర్ఆన్ మీకు బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ పరస్త్రీలను మంచి దృష్టితోగాని, చెడు దృష్టితో గాని ఏమాత్రం చూడకూడదని ఆదేశిస్తుంది. ఎందుకనగా వారి వలన మీరు సన్మార్గమును విడిచెదరు. పైగా పరస్త్రీలు ఎదురుపడినప్పుడు తమ దృష్టిని నేలకు వాల్చుకోవాలని, వారిని గుర్చి గాని, వారి రూపు రేఖలను గుర్చి తెలుసుకొనుటకు ప్రయత్నించకూడదని ఆదేశిస్తుంది. ఆ తొలికరి జల్లులో ఎదుటి వ్యక్తి కనిపించిన విధముగా సన్నగిల్లిన చూపుతో చూడవచ్చును. అదే విధముగా మీకు మత్తు ఆవాహించునంత వరకు మధ్యం సేవించకూడదని ఇంజీల్ బోధించినట్లుగా పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పైగా మీరు అసలు మధ్యపానమే చేయడకూదని నిషేధిస్తుంది. ఒకవేళ మధ్యపానం చేసినచో మీకు మీ దైవమార్గం లభించదని, దేవుడు మీతో సంభాషించదని, మలినముల నుండి మిమ్ములను పరిశుద్ధులుగా తీర్చిదిద్దడని కూడ హెచ్చరిస్తుంది. పైగా ఇవన్నియు షైతాన్ కృత్యాలని, వీటి నుండి తమను తాము రక్షించుకొమ్మని హితోపదేశం చేస్తుంది. అనవసరముగా మీ సోదరునిపై కోపమును ప్రదర్శించకూడదని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ కేవలం తమ కోపమును అదుపులో పెట్టుకోవడమే గాకుండా ఇతరులతో తవా సౌబిల్ మర్హమతి (అల్ బలద్: 18)కి అనుగుణముగా నడుచుకొంటూ, ఇతరులు కూడ నడుచుకొనునట్లు ప్రోత్సహించమని, నీవు ఒక్కడివే ఇతరులపై ప్రేమను పంచకుండా, ప్రేమను పంచమని మీ సోదరులకు కూడ తెలియజేయమని ఆదేశిస్తుంది. మీ భార్య వ్యభిచారానికి పాల్పడినప్పుడు తప్ప మిగిలిన అన్ని తప్పిదాలను క్షమించివేయమని, వారికి విడాకులు ఇవ్వకూడదని ఇంజీల్ తెల్పినట్లుగా పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ అత్తయ్యిబాతు లిత్తయ్యిబీనా (అన్నూర్:27) అని బోధిస్తుంది. అపవిత్రులు పవిత్రులతో ఉండలేరని పవిత్ర ఖుర్ఆన్ ఉద్దేశం. ఒకవేళ నీ భార్య వ్యభిచారానికి పాల్పడకున్నను పరపురుషులను వ్యామోహపు దృష్టితో చూస్తూ, వారితో అవకాశం కోసం ఎదురు చూస్తున్నచో, అప్పటి వరకు ఆమే శారీరకముగా కలుసుకోకున్నను, పర పురుషులకు తన నగ్నత్వము కనబడునట్లు వ్యవహరించినచో ఆమేపై వ్యభిచారపు వ్యాజ్యము మోపబడుతుంది. ఆమే పరపురుష ధ్యానురాలిగా, నీచురాలిగా, నీవు విశ్వసించునట్టి పవిత్ర దైవం పట్ల అయిష్టతను కనబర్చునట్టి మహిళగా భావించబడుతుంది. ఒకవేళ ఆమే తన వ్యవహారశైలిని మార్చుకొనని యెడల ఆమేకు విడాకులు ఇవ్వు అనుమతి నీకు గలదు. ఎందుకనగా ఆమే తన కర్మల దృష్ట్యా నీతో వేరుపడినది. ఇట్టిస్థితిలో ఆమే నీ అర్ధాంగి కాజాలదు. కావున ఇకపై నీవు ఆమేతో వెఱ్ఱి వాని వలె జీవించ వలసిన అవసరం లేదు. ఎందుకనగా ఇకపై ఆమే నీ అర్ధాంగి కాదు. ఆమే నీ శరీరంలో కుళ్ళిన ఒక అవయవము వంటింది. ఆ అవయమును కోసి పడవేయవలసినదే. లేనిచో అది మిగిలిన అవయవాలను కూడ కుళ్ళిపోవునట్లు చేయును. చివరికి నీవు మరణించెదవు. అదే విధముగా మీరు ప్రమాణాలు చేయకూడదని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్ఆన్ మిమ్ములను నిలువరించడం లేదు. కేవలం నిష్ప్రయోజనమైన ప్రమాణాలు చేయకూడదని మాత్రమే బోధిస్తుంది. ఎందుకనగా కొన్ని విషయాలలో ప్రమాణంనే ప్రామాణికముగా తీసుకోవడం జరుగుతుంది. అల్లాహ్ తాలా ఒక ఆధారిత మాధ్యమమును వృధా చేయాలని భావించడం లేదు. దాని వలన అతని వివేకత కనుమరుగైపోతుంది. స్వాభావిక విషయమేమనగా మానవుడు ఏదేని వివాదంలో తన వైపు నుండి సాక్ష్యమును ప్రవేశపెట్టలేక పోయినప్పుడు ఆ వివాదంను పరిష్కరించుటకు దేవుని సాక్షిగా ప్రమాణం చేయవలసి ఉంటుంది. కావున ఆ సమయంలో దేవున్ని సాక్షిగా భావిస్తూ ప్రమాణం చేయడం జరుగుతుంది. అదే విధముగా ఏ చోటకూడ దౌర్జన్యమును ఎదురించకూడదని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్ఆన్ మీకు బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ ఈ విషయంలో జజాఉ సయ్యిఅతిన్ సయ్యిఅతున్ మిస్‌లుహా ఫమన్ అఫా వ అస్లహాఫ అజ్‌రుహు అల అల్లాహి. (షురహ్: 41) అని బోధిస్తుంది. అనగా చెడుకు ప్రతీకారం మీకు జరిగిన చెడుకు సమానంగానే ఉండాలి, కాని ఎవరైతే క్షమించెదరో, తప్పిదములను మన్నించెదరో, ఈ క్షమాపణ వలన చెడు జరుగకుండా మంచి జరుగుచున్నచో అల్లాహ్‌తాలా అతని పట్ల హర్షంను వ్యక్తపర్చును. అతనికి అతని ప్రతిఫలములను అందించును. కావున పవిత్ర ఖుర్ఆన్ దృష్ట్యా అన్ని చోట్ల క్షమించడం సరికాదు, అన్ని చోట్ల శిక్షించడం సబబు కాదు. సమయస్ఫూర్తితో వ్యవహరించుకోవాలి. శిక్షించుటకు, క్షమించుటకు ముందు వారి జీవిత పూర్వపరాలను పరిగణించాలి. అంతేగాని విచ్చలవిడిగా ఉండకూడదు. ఇదే పవిత్ర ఖుర్ఆన్ ఉద్దేశం. తమ శత్రువులను ప్రేమించుము అని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ ప్రకారం వ్యక్తిగతంగా మీకు ఎవరు శత్రువులు ఉండకూడదు. అందరి పట్ల మీరు సమానమైన సానుభూతిని చూపించాలి. కాని నీ దేవుని శత్రువు, నీ ప్రవక్త శత్రువు, దైవ గ్రంథ శత్రువులనే నీ శత్రువులుగా భావించ వలెను. కావున ఇలాంటి వారిని కూడ నీ దుఆలలో మరిచిపోకూడదు. మీరు వారి నడవడికను ద్వేషించాలి గాని, వారి వ్యక్తిత్వాన్ని కాదు. వారు చక్కదిద్ద బడుటకు ప్రయత్నించవలెను. ఈ విషయమును గుర్చి మరల ఇట్లు తెలిపెను. ఇన్నల్లాహా యఅమురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాని వ ఇయితా ఇజిల్ ఖుర్బా (అన్నహల్: 91) అనగా అల్లాహ్ తాలా మీ నుండి ఏమి కోరుకుంటున్నాడు. కేవలం మీరు మానవజాతితో న్యాయబద్ధముగా వ్యవహరించుము. వారు మీకు ఎలాంటి మంచిని తలపెట్టకున్నను అంతకు మించి వారికి మంచిని చేయుము. మరల అన్నింటిని మించి ఒక తల్లి తన పిల్లలతో వ్యవహరించునట్లుగా మీరు కూడ దైవ ప్రాణులతో వాస్తవానికి వారి స్వంత బంధువుల కన్న ఎక్కువ సానుభూతితో వ్యవహరించుము. ఎందుకనగా ఉపకారంలో స్వార్థమనే స్వభావం దాగి ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఉపకారం చేయువారు తమ ఉపకారమును గుర్తుచేస్తుంటారు. కాని తల్లి వలే స్వాభావికముగా ఉత్సాహంతో పుణ్యము చేయువారు ఎన్నడు కూడ తమ ఉపకారములను ప్రస్తావించరు. అందుకే పుణ్యకార్యములలో చివరి స్థాయి తల్లివలే స్వాభావిక ఉత్సాహంతో వ్యవహరించుట. కావున ఈ సూక్తి కేవలం మానవులకే పరిమితం కాకుండా దేవునితో కూడ న్యాయబద్ధముగా వ్యవహరించుమని తెలియజేస్తుంది. దేవునితో న్యాయబద్ధముగా వ్యవహ రించడమనగా, అతని అనుగ్రహాలను గుర్తుచేసుకొంటూ అతని పట్ల విధేయతను కనబర్చుట. దేవునికి ఉపకారం చేయడమనగా, అతన్ని మనం చూస్తున్నట్లుగా ఖచ్చితమైన నమ్మకాని కల్గియుండడం. దేవునితో ఇయితా ఇజిల్ ఖుర్బా అనగా స్వర్గం లభిస్తుందనే ఆశతోగాని,

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 20 NOV 2025, Issue No - 47

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

నరకంలో వేయబడుతామనే భయంతో గాని కాకుండా ప్రేమతో, విధేయతతో అతనిని ఆరాధించడం. ఒకవేళ స్వర్గ నరకాలు లేకున్నను అతని పట్ల ఉన్నటువంటి అభిమానం, విధేయతలో ఎలాంటి వ్యత్యాసం రాకుండా అతనిని ఆరాధించవలెను. మిమ్ములను శపించువారికి శుభములు కలుగాలని ఆశించుమని ఇంజీలు బోధిస్తుంది. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం నీవు నీ స్వంతముగా ఏ ఆకాంక్షను కోరుకొనకుము అని బోధిస్తుంది. ఇలాంటి వ్యక్తితో ఏ విధముగా వ్యవహరించాలని దైవ తేజస్సుకు నిలయమైన నీ హృదయాన్ని ఫత్వా అడుగుము. ఈ శపించువాడు కరుణించబడుటకు అర్హుడని, ఆకాశంపై ఇతనిని ఎవరు శపించడం లేదని ఒకవేళ అల్లాహ్ తాలా మీ మనస్సుకు తెలియజేయబడినచో దేవునికి శత్రువు కాకుండా ఉండుటకై నీవు కూడ అతనిని శపించకుము. కాని ఒకవేళ నీ బుద్ధి అతడు మందబుద్ధివాడు కాదని గ్రహించినచో, ఆకాశంపై ఇతడు శపించబడువాడని నీ మనస్సుకు తెలియజేయబడినచో ఏ ప్రవక్త కూడ షైతాన్ కొరకు శుభములను ఆశించనట్లుగా నీవు కూడ అతని కొరకు శుభములను ఆశించకుము. ఏ ప్రవక్త కూడ షైతాన్‌ను శపించకుండా వదిలిపెట్టలేదు. కాని ఆః నీవు మాత్రం ఒకరిని శపించుటలో తొందరపడకుము. ఎందుకనగా అపోహాలలో అనేకములు అవాస్తవములే. ఇలాంటి స్థితిలో అనేక శాపములు శపించువారికే వర్తిస్తాయి. జాగ్రత అడుగులు వేయుము. పూర్తి స్థాయిలో పరిశీలించిన తదుపరియే ఏదేని పనిని ప్రారంభించుము. దేవున్ని సహాయము ఆర్జించుము. ఎందుకనగా మీరు అంధులు. కావున పొరపాటున కూడ న్యాయబద్ధుడిని దౌర్జన్యుడిగా, సత్యవంతుడిని అబద్ధీకుడిగా భావించకుము. ఇలా జరిగినచో నీ దేవుడి కోపానికి నీవే కారకుడవు అవుతావు. నీ సత్కార్యములన్నియు వ్యర్థమవగలవు. మరల నీవు నీ సత్కార్యములను ప్రజలకు కనిపించకుండా చేయుమని ఇంజీల్ బోధిస్తుంది. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం నీ సత్కార్యములన్నియు ప్రజలకు కనిపించకుండా చేయకుము అని బోధిస్తుంది. ఒకవేళ నీవు గోప్యముగా చేయునట్టి సత్కార్యముల వలన నీ వ్యక్తిత్వానికి అవి ప్రయోజనం చేకూర్చుచున్నచో అట్టి కారణాల వలన ఆయా సత్కార్యములను గోప్యముగానే చేయుమని, అదే విధముగా బహిరంగముగా చేయునట్టి సత్కార్యముల వలన ప్రజలకు ప్రయోజనం చేకూర్చునని భావించినచో నీకు రెట్టింపు పుణ్యము లభించుటకై ఆయా సత్కార్యములను బహిరంగముగానే చేయుమని ఆదేశిస్తుంది. ఫలితముగా అటి సత్కార్యముల ప్రాధాన్యత తెలియని బలహీన ప్రజలు కూడ మిమ్ములను అనుసరిస్తూ ఆయా సత్కార్యములను చేయుదురు. మొత్తానికి అల్లాహ్ తాలా తన గ్రంథములో సిర్రన్ వ అలానియతన్ (అర్రాద్: 23) అని తెల్పినాడు. అనగా గోప్యముగా మరియు బహిరంగముగా ధాన ధర్మాలు చేయుము. ఈ ఆదేశాల వాస్తవికతను కూడ అతడే వివరించినాడు. దీని అర్థమేమనగా కేవలం ప్రజలకు మాటలతో నచ్చజెప్పడమే గాకుండా ఆచరణాత్మకముగా ప్రోత్సహించుమని అర్థం. ఎందుకనగా అన్ని చోట్ల మాటలు ప్రభావంను చూపలేవు. అనేక చోట్ల ఆదర్శమే ప్రభావాన్ని చూపుతుంది.

మరల నీవు దుఆ చేయునప్పుడు నీ భవనంలోకి వెళ్ళిపొమ్ము అని ఇంజీల్ బోధిస్తుంది. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం నీవు అన్ని వేళల గోప్యముగా దుఆలు చేయకుండా, కొన్ని సార్లు ప్రజల ముందు బహిరంగముగా, మీ సోదరులతో కలసి సామూహికముగా స్పష్టముగా దుఆలు చేయమని బోధిస్తుంది. ఫలితముగా మీరు చేయు దుఆలు స్వీకరించబడినచో ఆ సామూహికుల విశ్వాసం పటిష్టమగును, ఇతరులు కూడ దుఆలవైపు శ్రద్ధను కనబర్చుదురు.

అదే విధముగా ఇంజీల్‌లో మీరు ఈ విధముగా దుఆ చేయగలరని గలదు. ఆకాశము మీద ఉన్నటువంటి ఓ మా తండ్రి! నీ నామముతో పరిశుద్ధము కలుగు గాక!, నీ ప్రభుత్వమే ఏర్పడును గాక!. ఆకాశము మీద నీకు అధికారము ఉన్నట్లే ఈ భూమండలంపై కూడ నీ అధికారమే కొనసాగును గాక!. మా ప్రతి దినపు రొట్టెలలో ఈ రోజువి మాకు ప్రసాదించుము. మేము ఏ విధముగా మా ఋణగ్రస్థులకు ఋణమునిచ్చెదమో నీవు కూడ మాకు ఋణమును ప్రసాదించుము. మమ్ములను పరీక్షించకుము. కేవలం చెడు నుండి రక్షించుము. ఎందుకనగా చక్రవర్తిత్వం, అధికారము, గొప్పదనం ఎల్లప్పుడు నీదే కొనసాగును. కాని పవిత్ర ఖుర్ఆన్ భూమండలంపై అధికారం లేదని చెప్పకుండా ఆకాశముతో పాటు భూమండలంలో కూడ దేవుని పరిశుద్ధ కీర్తనలు కొనసాగుచున్నాయని చెబుతుంది. ఆ సూక్తి ఇలా గలదు. **వ ఇన్ మిన్ షైఇన్ ఇల్లా యుసబ్బిహు బిహమ్‌దిహి (బనీ ఇస్రాయీల్ :45) యుసబ్బిహు లిల్లాహి మాఫిస్సమావాతి వల్ అర్‌జి**. (జుమా: 2) అనగా ఆకాశము మరియు భూమండలంలోని అణువణువు దేవుని పరిశుద్ధతను, స్తోత్రములను కొనియాడు చున్నవి. వాటిలో ఉన్నవన్నియు పరిశుద్ధతను, స్తోత్రములలో లీనమై ఉన్నవి. పర్వతాలు అతని స్మరణలో లీనమై ఉన్నవి. నదులు అతని స్మరణలో లీనమై ఉన్నవి. వృక్షములు అతని స్మరణలో లీనమై ఉన్నవి. ఎందరో సత్పురుషులు అతనిని స్మరించుటలో లీనమై ఉన్నారు. మరల తమ హృదయము మరియు నోటితో అతనిని స్మరించుటలో లీనము కాని వ్యక్తులను, దేవుని ముందు విధేయతతో కూడిన భక్తిని ప్రదర్శించని వ్యక్తులను రకరకాల బంధనాలు, ఆపదలు దైవ విధి ధర్మము వారితో విధేయతభరిత భక్తిని ప్రదర్శింప జేస్తుంటాయి. దేవుని గ్రంథములో అవి చాలా ఉన్నత స్థాయిలో విధేయతను ప్రదర్శిస్తున్నాయని దైవదూతలను గూర్చి కొనియాడినట్లుగా భూమండలంపై గల అణువణువును గూర్చి పవిత్ర ఖుర్ఆన్ కొనియాడుతుంది. సృష్టిలోని ప్రతీది అతని పట్ల విధేయతను చూపుతుంది. అతని అనుమతి లేనిదే ఒక్క ఆకు కూడ రాలిపడదు. అతని ఆదేశము లేనిదే ఏ ఔషదము స్వస్థతను చేకూర్చదు. ఏ పోషకాలు శక్తిని సమకూర్చలేవు. ప్రతి వస్తువు అత్యున్నత స్థాయి భక్తి, శ్రద్ధలతో దేవుని ఆస్థానములో మోకరిల్లుతున్నాయి. అతని పట్ల పూర్తి విధేయతను ప్రదర్శించుటలో లీనమై ఉన్నాయి. పర్వతాలు, భూమండలపు అణువణువు, నదులు, సముద్రపు ప్రతి నీటి బొట్టు, వృక్షాలు, మొక్కల ప్రతి ఆకు, వాటి ఒక్కొక్క కాండము, మానవులు, జంతువులకు చెందిన అన్ని రకాలు దేవున్ని గుర్తిస్తాయి, అతని పట్ల పూర్తి విధేయతను ప్రదర్శిస్తాయి. అతని పవిత్రతను, స్తోత్రములను స్మరించుటలో లీనమై ఉంటాయి. అందుకే అల్లాహ్ తాలా **యుసబ్బిహు లిల్లాహి మా ఫిస్సమావాతి వల్ అర్‌జి.** (జుమఅ: 2) అని తెలుపడం జరిగింది. అనగా ఏ విధముగానైతే ఆకాశంలో గల ప్రతీది దేవున్ని స్తోత్రించుచు అతని పవిత్రతను కొనియాడు తుంటాయో అదే విధముగా భూమండంలోని ప్రతి వస్తువు అతనిని స్తోత్రించుచు అతని పవిత్రతను కొనియాడు తుంటాయి. అలాంటప్పుడు భూమండలంపై దేవుని స్తోత్రము మరియు పవిత్రత కొనియాడబడదా? ఇలాంటి పదాలు ఏ దైవజనుడి నోటి వెంట వెలువడవు. ఒక విధముగా చెప్పదలచినచో భూమండలంపై గల సకల చరాచర ప్రాణులలో కొన్ని ధర్మశాస్త్రపు ఆదేశాలకు లోబడి విధేయతను ప్రదర్శిస్తుండగా మరి కొన్ని దైవ విధి ధర్మపు ఆదేశాలకు లోబడి ఉన్నవి. మరి కొన్ని ఈ రెండింటికి లోబడి విధేయతను ప్రదర్శించుటలో నిమగ్నమై ఉన్నవి. మేఘాలైనను, గాలులైనను, నిప్పు అయినను, నేలైనను అన్నియు దేవుని పట్ల విధేయతను ప్రదర్శించుటలో, పవిత్రతను కొనియాడుటలో లీనమైపోయాయి. ఒకవేళ ఏ మానవుడైన దైవ ధర్మశాస్త్రపు ఆదేశాలను ధిక్కరించుచున్నచో అతడు దైవ విధి ధర్మపు ఆదేశాలకు కట్టుబడియే ఉండును. ఈ రెండు అధికారాల నుండి ఎవరు కూడ తప్పించుకోలేరు. ప్రతి ఒక్కరి తల ఏదేని ఆకాశాధికారపు బంధనములో బంధింపబడి ఉన్నది. కాని మానవుని హృదయ సంస్కరణ మరియు అలజడుల కారణముగా నిర్లక్ష్యం, దైవస్మరణ ఒకదాని తరువాత మరొకటి ఈ భూమండలంపై తమ ఆధిపత్యంను ప్రదర్శిస్తుంటాయి. కాని వివేక, విలక్షణుడైన దైవ అనుమతి లేనిదే ఈ సహాయ సహకారములు స్వయంగా చేకూరలేవు. భూమండలంలో ఈ విధముగా జరగాలని దైవం కోరినది కావున ఆ విధముగానే జరిగెను. కావున మార్గదర్శకం, భ్రష్టత్వ కాలాలు కూడ రాత్రింభవళ్ళ వలే దేవుని ఆదేశం, అనుమతులకు అనుగుణముగా కొనసాగుతుంటాయి. అంతేగాని స్వయం ప్రతిపత్తితో కాదు. అతని సృష్టిలోని ప్రతీది అతని ఆహ్వానాన్ని ఆలకిస్తూ, అతని పవిత్రతను కొనియాడుతుంది. అయినాకూడ భూమండలం దేవుని పవిత్రతో ఖాళిగా ఉందని ఇంజీల్ పేర్కొంటున్నది.

(7వ పేజిలో)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz